PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.02.2013, శుక్రవారం
సంపుటి : 32 సంచిక : 35
పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు..
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)
Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## మద్రాస్ యూనివర్శిటీ సిండికేట్ సభ్యుడిగా ప్రొ॥ సి.యం.కె.రెడ్డి

వివరాలు 11వ పేజీలో...



## నోటికదుపులేని.. దేశద్రోహి



### గల్ఫ్‌దేశాలలో అయితే కేసీఆర్‌కు ఉరి ఖాయం
### అతిప్రజాస్వామ్య దేశం కాబట్టే బ్రతికి వున్నాడు


ఇది దిక్కుమాలిన దేశం... పార్లమెంటులో వప్రాసీకుండే తెలివి కూడా ఈ ప్రధానమంత్రి గానికి లేదు... జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరలు కూడా తెలంగాణకు ద్రోహం చేసిండ్రు... ఈ మాటలు నియంతలపాలన వుండే దేశాల్లో అని వుంటే తల, కాళ్లు, చేతులు వేటికవి సపరేటుగా నరికి వుండేవాళ్లు.

గల్ఫ్ దేశాలలో ఇలా అనివుంటే అన్నవాడిని బహిరంగంగా ప్రజలముందే టీవీ రియాల్టీషో మాదిరిగా ఉరికొయ్యకు వేలాడదీసి వుండేవాళ్లు. కనీసం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలలో అయినా ఇంత క్రూరంగా, నీచంగా మాట్లాడిన నికృష్టుడిపై వెంటనే కేసులుపెట్టి జైల్లో తోసి వుండేవాళ్లు. మనది అతి ప్రజాస్వామ్య దేశం కాబట్టి, అతిమంచితనం, అతి మెతకతనం ఎక్కువకాబట్టి ఈ స్థాయిలో మాట్లాడి కూడా కేసీఆర్ అనే దుర్మార్గపు రాజకీయ నాయకుడు, కరుడుగట్టిన ఉగ్రవాది కసబ్ కంటే విషం చిమ్మగల దేశద్రోహి బయట దర్జాగా తిరుగుతున్నాడు. అసలు ఇది ప్రజాస్వామ్య దేశమంటే నమ్మాలా అని కేసీఆర్ సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమరదీక్ష సభలో ప్రశ్నించారు. నిజమే, ఇది ప్రజాస్వామ్య దేశం కాదు.. ఈ దేశాన్ని దిక్కుమాలిన దేశమని మాట్లాడి కూడా ఆయన బ్రతికి వున్నాడంటే, బట్టకట్టి బయట తిరుగుతున్నాడంటే ఇది అతి ప్రజాస్వామ్య దేశమనే అనుకోవాలి. వాక్‌స్వాతంత్ర్యానికి ఇక్కడ హద్దులు లేకపోబట్టే మొన్నటికి మొన్న అక్బరుద్దీన్ ఒవైసీ అనే

(మిగతా 5వ పేజీలో)

## గోవింద నామస్మరణతో... మార్మోగిన మాగుంట లే అవుట్

వివరాలు 7వ పేజీలో...




## 'సహకార' సమరంలో కాంగ్రెస్ హవా!

జిల్లాలో 99సొసైటీలకుగాను తొలివిడత 31వ తేదీ 53సొసైటీలకు ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ తన హవాను చాటుకుంది. అధికారదర్పాన్ని ప్రయోగించి అధికసొసైటీలను సొంతం చేసుకుంది. 53సొసైటీలకు గాను 3సొసైటీలలో స్టే కారణంగా ఎన్నికలు ఆగిపోయాయి. 14సొసైటీలు ఏకగ్రీవం కాగా 29సొసైటీలకు గురువారం ఎన్నికలు జరిగాయి. మొత్తం సొసైటీలకుగాను అధికార కాంగ్రెస్‌కు 39స్థానాలు దాకా వచ్చినట్లు సమాచారం. ప్రతిపక్ష తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌లు ఒక అంకె స్థానాలకే పరిమితమైనట్లు సమాచారం. సీపీఎంకు ఒక సొసైటీ దక్కినట్లు తెలుస్తుంది.

## మమ్మీ... విశ్వరూపం
### "కమల్‌కు రొంబ కష్టం"

వివరాలు 5వ పేజీలో...





PDF Compressor Free Version



# మిన్నంటిన దేశభక్తితో...
# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



నెల్లూరు పోలీస్‌స్టేషన్ పెరేడ్‌గ్రౌండ్‌లో 64వ గణతంత్రదినోత్సవ వేడుకలు జనవరి 26న ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా వివిధ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు "బాలలం మేము పూలమాలలం మేము" అని నెల్లూరు సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు "దేశ్ కే రంగీలా" అని, మూలాపేటలోని లిటిల్‌ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు 100మంది "మనదేశం మనగీతం" అని, బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు "ఇలలో సాటిలేని భారతదేశం" అని, దర్గామిట్ట జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు "భారతదేశ వైభవం" అని, ఏసినగర్‌లోని కార్పొరేషన్ హైస్కూలు విద్యార్థులు "జయహో" అంటూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు విచ్చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలలో దేశభక్తిని ఇనుమడింపచేశాయి.

ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన పలువురికి గౌరవ పురస్కారాలందజేశారు. తదుపరి వివిధశాఖలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 485మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను ప్రదానంచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాతీయజెండాను ఆవిష్కరించి పోలీసు వందనం స్వీకరించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నగరశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, సూళ్ళూరుపేట శాసనసభ్యులు పరసారత్నం, జిల్లా ఎస్పీ రమణకుమార్, జె.సి బి.లక్ష్మీకాంతం, డి.ఆర్.ఓ రామిరెడ్డి, ఆర్డీఓ కె.మాధవీలత వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసారి గణతంత్ర దినోత్సవంలో విశేషం ఏమిటంటే ఇంతకు ముందు ఎప్పుడూ చూడని విధంగా గగనతలం నుంచి పూలవర్షం కురిపించడం. కవాతు, దేశభక్తిని చాటే కార్యక్రమాల్లో కృష్ణపట్నం పోర్టుకు చెందిన హెలికాప్టర్ ద్వారా ఈ పూలవర్షం కురిపించి అందరిని ఆశ్చర్యచకితులను చేశారు. నగరం నలుమూలలా వున్న పాఠశాలల్లో త్రివర్ణ పతాకం ఠీవిగా మువ్వన్నెలతో రెపరెపలాడింది. వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు, ఉద్యోగులు పాల్గొనగా గణతంత్ర దినవేడుకల్లో దేశభక్తి మిన్నంటింది.





మంత్రి ఆనం నుండి జ్ఞాపికను అందుకుంటున్న డిఆర్ఓ బి.రామిరెడ్డి, ఆర్డీవో మాధవీలత


కలెక్టర్ బి.శ్రీధర్ నుండి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న టి.యస్.ఆర్.ఆంజనేయులు, భాగ్యలక్ష్మి, డా॥ మాశిలామణి, కమలాకర్‌రెడ్డి, వి భక్తవత్సలం, రాజేశ్వరరావు




సాహితీ పురస్కారాలందుకున్న డి.వి.రమణయ్య, బి.వి.నరసింహం, ఆలూరి శిరోమణిశర్మ, బెనర్జీ

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న నాగేశ్వరరావు, వెంకటనాథ్‌రెడ్డి, బాల వెంకటేశ్వరరావు, సురేష్‌కుమార్, వి.యస్.రాంబాబు

సత్యంజీ గ్రూప్
సత్యంజీ
సింహపురి సిటి
అందమైన గ్రీన్ పార్క్
వి.బి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.



Plot Size 36 X 60
డ్యూప్లెక్స్ హౌస్
ప్రారంభం ధర 39 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 49 లక్షలు



Plot Size 33 X 60
డబుల్ బెడ్ రూం హౌస్
ప్రారంభం ధర 34 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 44 లక్షలు
మీ పెట్టుబడులు రెట్టింపు కొరకు You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M. 7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

సత్యంజీ గ్రూప్
సత్యంజీ
సింహపురి సిటి
అందమైన గ్రీన్ పార్క్
వి.బి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.
నెల్లూరు సిటీలో 36 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీలో
బ్యాంకులోన్ కస్టమర్స్‌కు
డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ 1100 Sft.
23,00,000/-
SPOT CASH
14,00,000/-
ప్రాజెక్ట్-1లో ఈ అవకాశం 10 మందికి మాత్రమే.
* Car Parking Extra
సర్వీస్ అపార్ట్‌మెంట్స్ 400 Sft.
ఫర్నిచర్‌తో కలిపి
10,00,000/-
*Car Parking Extra మాత్రమే.
33 అం॥ ప్లాట్స్ బై బ్యాక్ పద్ధతిలో
2 సం॥లకే
డబుల్ బెనిఫిట్
మొదటి 60 మందికి మాత్రమే.
మీ పెట్టుబడులు రెట్టింపు కొరకు You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M. 7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

సత్యంజీ గ్రూప్
సత్యంజీ
సింహపురి సిటి
అందమైన గ్రీన్‌పార్క్
వి.బి.ఆర్. స్కూల్ దగ్గర, ధనలక్ష్మీపురం, మెయిన్ రోడ్డు, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.




Plot Size 36 X 60
డ్యూప్లెక్స్ హౌస్
ప్రారంభం ధర 50 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 60 లక్షలు



Plot Size 36 X 60
డ్యూప్లెక్స్ హౌస్
ప్రారంభం ధర 46 లక్షలు
మొదటి ఇద్దరికి 5 లక్షల విలువ గల ప్లాటు గిఫ్ట్‌గా ఇవ్వబడును.
ఈ హౌస్ పూర్తి అయిన తరువాత ఖచ్చితమైన ధర 56 లక్షలు
మీ పెట్టుబడులు రెట్టింపు కొరకు You Tube, R.R., S.Tv., Gem Channels చూడండి.
శుక్రవారం 7.30 P.M.
శనివారం 10.30 A.M. 7.30 P.M.
ఆదివారం 10.30 A.M.
బ్యాంకు లోన్ సౌకర్యం కలదు
9133 222 558
0861-2318286, 2341183
08622272555
www.satyamglanddevelopers.org
e-mail : jayasankar441@yahoo.com

## కాలధర్మం

# 'బ్రదర్' వెళ్లిపోయాడు



## ఆర్.వి.శేషయ్యనాయుడు ఇక లేడు

అందర్నీ ఆప్యాయంగా గుండెలకు హత్తుకొని బ్రదర్ అని సంబోధిస్తూ, అందరి మంచినీ కోరుకొనే మంచి మనిషి ఆర్వీ శేషయ్యనాయుడు తిరిగిరాని లోకాలకు తరలిపోయాడు. నెల్లూరు టాక్స్‌బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా, గౌరవాధ్యక్షులుగా అసోసియేషన్‌తో ఆయన అనుబంధం విడదీయరానిది. నెల్లూరు కళాసాంస్కృతికరంగాల పట్ల ఆయనకెంతో గౌరవం ఉండేది. ఎవరు కార్డిచ్చి పిలిచినా హాజరయ్యే వ్యక్తి ఆయన. మానవీయ సంబంధాలకు ప్రాధాన్యతనిచ్చే అపురూప వ్యక్తి ఆయన. దాదాపు 80సంవత్సరాల వయస్సులో కూడా ఆయన జ్ఞాపకశక్తి అమోఘం. కళాసాంస్కృతిక రంగాలకు ఆయన అందించిన విరాళాలెన్నెన్నో. ఎవరు వెళ్ళి తాము తలపెట్టిన కార్యక్రమం వివరించినా వాళ్ళకు తమవంతు సహాయసహకారాలు అందించిన కళాపోషకుడాయన. ప్రముఖ ఆడిటరు సిఎల్ నారాయణరావు గారి వద్ద సిఏ అప్రెంటీస్‌షిప్ పూర్తిచేశారు. బిఎల్ చదివారు ఆయన ఆడిటరుగా ప్రాక్టీసు చేస్తూ ఎంతో పేరుగడించారు. యువ ఆడిటర్లకు ఆయన ఎంతో సహకారం అందించేవారు. వివరణాత్మకంగా ఇన్‌కంటాక్స్ చట్టాన్ని బోధించేవారు. నవ్వుతూ నవ్విస్తూ గడిపే ఆయన జీవితంలో సిఏ పూర్తిచేసిన కుమారుడు యాక్సిడెంట్‌లో మరణించడం అత్యంత విషాదకరమైన సంఘటన. అయినా ఎంతో నిబ్బరంగా వ్యవహరించేవారాయన. ఇప్పుడు ఆయన కుమార్తె కుమారుడు అమెరికాలో ఉన్నారు. టాక్స్‌బార్ అసోసియేషన్‌లో ఏ సభ జరిగినా ఆయన ప్రసంగించకుండా ఉండేవారు కాదు. తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా ప్రకటించే నిర్మోహమాటి ఆయన. పరిచయస్తులందర్నీ ప్రశంసతో ముంచెత్తి స్ఫూర్తినిచ్చే అపూర్వ నైజం ఆయనది. ఆయన మరణం నెల్లూరు సాహితీకళారంగాలకు తీరనిలోటు. యువ ఆడిటర్లు పెద్దదిక్కును కోల్పోయినట్లయింది. కుటుంబ సమేతంగా జనవరి 30వ తేదీ తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్న అనంతరం అస్వస్థతకుగురై తుదిశ్వాసను విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని గురువారం నెల్లూరుకు తీసుకువచ్చారు. వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతిని తెలియజేస్తున్నది "లాయర్".

# మినిబైపాస్‌లో బోర్డుల తొలగింపు

నెల్లూరు మినీబైపాస్(రాజీవ్‌రహదారి)లో రోడ్డుకిరువైపులా పుట్టలకొద్దీ వెలసిన సైన్‌బోర్డులను 31వ తేదీ గురువారం సాయంత్రం మునిసిపల్ అధికారులు తొలగించారు. మినీబైపాస్‌ను ఆరులైన్ల రోడ్డుగా విస్తరిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ బోర్డులను తొలగించారు. త్వరలో రానున్న ముఖ్యమంత్రి ఈ ఆరులైన్ల విస్తరణ కార్యక్రమానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. రెండ్రోజులుగా నగరంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కూడా నగరంలో అడ్డదిడ్డాలుగా వెలసిన బోర్డులను తొలగించమని మునిసిపల్ అధికారులను ఆదేశించడంతో నగరంలో ఈ తొలగింపు కార్యక్రమం కొనసాగుతున్నట్లు సమాచారం.

PDF Compressor Free Version






# సీఎం vs ఆనం

## సహకార కుర్చీతో సయ్యాట



### కిరణ్ ఆశీస్సులతో సుమంత్

### ఆనంనే నమ్ముకున్న మెట్టుకూరు



వర్గరాజకీయాలకు పుట్టిల్లు కాంగ్రెస్‌పార్టీ. కాంగ్రెస్ నాయకులు ప్రత్యర్థులతో కంటే కూడా తమలో తామే బలంగా పోరాడుతుంటారు. ఒకర్నొకరు దెబ్బతీసుకోవాలని చూస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న సహకార ఎన్నిలలో కూడా అదే జరుగుతుంది.

జిల్లాలోని 99సొసైటీలకు జనవరి 31, ఫిబ్రవరి 4తేదీలలో రెండు విడతలుగా ఎన్నికలు జరుగుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందనుకున్న కొన్ని సొసైటీలలో అధికారపార్టీ స్టే తీసుకొచ్చి ఎన్నికలను నిలిపేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలలో ప్రత్యర్థి పార్టీలకు ఓట్లు లేకుండా చేయడం ద్వారా అలాంటి సొసైటీలను సైతం కాంగ్రెస్ తన ఖాతాలో జమచేసుకోగలిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గ కలహాలైతేనేమీ, మేం రాష్ట్రస్థాయి నాయకులమని చెప్పుకుంటున్న వారి నాయకత్వ లోపమైతేనేమీ సహకార బ్యాంకు ఛైర్మెన్ రేసులో వైయస్సార్ కాంగ్రెస్ గట్టి పోటీనిచ్చే పరిస్థితి లేకుండా పోయి, బ్యాంకు అధ్యక్షపీఠం ఇక కాంగ్రెస్‌కే ఖాయం అన్న స్థితి వచ్చేసింది.

అనూహ్యంగా మార్పులు సంభవిస్తే తప్పితే నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్ష పదవి అధికారపార్టీ వారిదే! ఇందులో సందేహం లేదు. కాకపోతే ఏ వర్గం వారికి దక్కుతుందన్నదే ప్రశ్న! ఆనం అనుచరులకే బ్యాంకు ఛైర్మెన్ కిరీటం దక్కుతుందన్నది అందరి అంచనా! కాని ఆ అంచనాలు తారుమారవుతున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో ఆనం ప్రాబల్యానికి కత్తెరవేసే దిశగా సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది.

కిరణ్ సీఎం అయ్యాక ఎంతో అభిమానంతో ఆనం రామ నారాయణరెడ్డికి ఆర్థికమంత్రి శాఖ అప్పగించారు. అయితే కొంతకాలానికే తన సీఎం కుర్చీకి ఆనం సోదరులు ఎసరు పెడుతున్నారనే అనుమానం కిరణ్‌లో చెలరేగింది. దీంతో అప్పటినుండి ఆయన ఆనం ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో అధికార్లను సైతం ఆనంకు తెలియకుండానే బదిలీ చేస్తున్నారు. ఆనంకు చెప్పకుండానే అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తున్నారు. ఒక చిన్న హోంగార్డు పోస్టుకు సైతం ఆనం సోదరుల సిఫారసులు చెల్లుబాటు కాలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా వుందో, కిరణ్–ఆనంల మధ్య ఎంతగా దూరం పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. సీఎం కిరణ్ తమపై కక్ష కట్టాడని తెలుసుకున్నాక ఆనం సోదరులు ఆయనతో కాకుండా డైరెక్ట్‌గా ఢిల్లీతోనే సంబంధాలు పెట్టుకుని తమ పనులు కానిచ్చుకోసాగారు. జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పుడు పెద్ద వర్గమంటూ వుండేది ఆనందే! జిల్లాలో పార్టీ పూర్తి బాధ్యతలు చూస్తున్నదీ వాళ్లే! మొన్న శాసనమండలి ఎన్నికలైతేనేమీ, నిన్న కోవూరు, ఉదయగిరి అసెంబ్లీలు, నెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికలైతేనేమీ పార్టీ పరంగా ఆరంభారం అంతా వారిదే! ఇప్పుడు సహకార ఎన్నికలలోనూ వారిదే ప్రధానపాత్ర అవుతుందనుకోవడంలో సందేహం లేదు. వారి తరపున బ్యాంకు ఛైర్మెన్ అభ్యర్థిగా ప్రముఖ రియల్టర్, అనంతసాగరం మండలానికి చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి రంగంలోకి దిగారు. అయితే స్వయంగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డే ఆయనకు మోకాలడ్డుతున్నట్లు తెలుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికలలో కోవూరు టిక్కెట్‌నాసించి భంగపడ్డ తన సోదరుడి వ్యాపార భాగస్వామి సుమంత్‌రెడ్డిని బ్యాంక్ ఛైర్మెన్ అభ్యర్థిగా సీఎం ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తుంది. సుమంత్‌కు కోవూరు మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మిలు సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వింజమూరు మండలానికి చెందిన సుమంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు. వరిణి సొసైటీ నుండి ఆయన ఇప్పుడు ఎన్నికయ్యారు. తనను కలిసిన మెట్టుకూరు ధనుంజయరెడ్డితో సైతం కిరణ్... ఆల్‌రెడీ సుమంత్‌కు చెప్పేసాను, నువ్వు రేస్‌లో వున్నది నాకు తెలియదు, ముందుగా ఒక మాట చెప్పివుంటే పరిస్థితి వేరేవిధంగా వుండేదేమో... ఈసారికి నేనుచేయగలిగిందేమీ లేదని చేతులెత్తేసినట్లు భోగట్టా! సుమంత్‌రెడ్డి విషయంలో కిరణ్ గట్టిగా వున్నాడు. ఇక మెట్టుకూరు విషయంలో ఆనం సోదరులు ఎంతవరకు తమ

(మిగతా 5వ పేజీలో)

## అటు మంత్రికి... ఇటు మేకపాటికి...

*జిల్లాలో 99 సహకార సంఘాలు వుండగా, 97 సొసైటీలు ఒకెత్తయితే మిగిలిన రెండు సొసైటీలు మాత్రం మరో ఎత్తు. ఆ రెండూ వుండేది మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని మర్రిపాడు మండలంలోనే! ఈ మండలం వైయస్సార్ కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్న మేకపాటి సోదరులకు సొంత మండలం కూడా కావడంతో ఇరువర్గాలకు ఈ రెండు సొసైటీలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.*

# బస్తీమే సవాల్...!

## ప్రతిష్ఠాత్మకంగా మారిన రెండు సొసైటీలు

మర్రిపాడు మండలంలోని బూదవాడ, భీమవరం సొసైటీలలో ఇప్పుడు యుద్ధవాతావరణం నెలకొనివుంది. మేకపాటి సోదరులు రాజకీయ అరంగేట్రం చేసినప్పటి నుండి ఈ రెండు సొసైటీలు వారి అధీనంలోనే వుంటున్నాయి. కాని ఈసారి మాత్రం నువ్వా–నేనా అన్నట్లుగా పోటీ నెలకొని వుంది. రెండు సొసైటీలలోనూ ఏ ఒక్క డైరెక్టర్ పదవి ఏకగ్రీవం కాలేదు. బూదవాడ సొసైటీ నుండయితే మేకపాటి సోదరులు తమ బావ సుబ్బారెడ్డిని ఛైర్మెన్ అభ్యర్థిగా రంగంలోకి దించివున్నారు. ఎన్నికల నమోదు అప్పుడే మేకపాటి సోదరులు కొంచెం జాగ్రత్త పడివుంటే ఈరోజు ఆ రెండు సొసైటీలలో అంత పోటీ నెలకొని వుండేది కాదు. ఓట్ల నమోదులో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉత్సాహంగా వ్యవహరించారు. స్థానిక నాయకులే ఓట్ల నమోదుకయ్యే ఖర్చును భరించి భారీగా తమ పార్టీవాళ్ల ఓట్లను చేర్పించారు. కాని వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు మాత్రం అంత ఉత్సాహంగా డబ్బులు ఖర్చుపెట్టి ఓట్లను చేర్పించలేకపోయారు. కాని ఈరోజు పరువుకు సంబంధించిన సమస్య కావడంతో తీవ్రంగా పోరాడుతున్నారు. ఓటర్లను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సొసైటీల పరిధిలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు తెలుస్తుంది. అధికార బలంతో కాంగ్రెస్ నాయకులు, స్థానిక బలంతో మేకపాటి

(మిగతా 5వ పేజీలో)

# 'దేశం' చేతులెత్తేసినట్లే!

## రెండో'సారి' లేనట్లే!

జిల్లా సహకార సంఘాల ఎన్నికలలో జిల్లా తెలుగుదేశంపార్టీ అధికార కాంగ్రెస్‌పార్టీ కొంగుచాటు బిడ్డలా మిగిలిపోయింది. కాంగ్రెస్‌కు అనుబంధసంస్థగా మారిందే తప్పితే ఎక్కడా అధికారపార్టీకి గట్టి పోటీనిద్దామన్న ప్రయత్నమే తెలుగుదేశంవైపు నుండి లేకుండా పోయింది. కాంగ్రెస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుని వైకాపాను దెబ్బతీయడమే లక్ష్యంగా పనిచేసింది గాని, ఎక్కడా బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించలేదు.

ఈ సహకార ఎన్నికలలోనూ తెలుగుదేశం పాత్ర నామమాత్రంగా మిగిలిపోనుంది. గత సొసైటీ ఎన్నికలలో కూడా ప్రతిపక్షంగా వున్న తెలుగుదేశం నామరూపాలు లేకుండా పోయింది. ఆరోజు కాంగ్రెస్‌లోని రెండువర్గాల మధ్యే బ్యాంకు ఛైర్మెన్ పదవి కోసం పోటీ జరిగింది. అప్పుడు తెలుగుదేశం వాళ్లు కాంగ్రెస్‌లోని ఒక వర్గం కొమ్ముకాసారు. ఇప్పుడైతే ఏకంగా కాంగ్రెస్‌పార్టీ కొమ్ముకాస్తున్నారు.

జిల్లాలోని 99సొసైటీలలో ఎక్కడా కాంగ్రెస్ వర్సెస్ టీడీపీ అన్న పోటీ లేదు. కాంగ్రెస్ పోటీ వున్న చోట తెలుగుదేశం లేదు, ఈ పార్టీ వున్న చోట కాంగ్రెస్ లేదు. పలు సొసైటీలలో డైరెక్టర్ పదవులను రెండు పార్టీలు

(మిగతా 5వ పేజీలో)



# ఆర్టీసీ మార్పుకు సన్నాహాలు

*నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం ఆర్టీసీ బస్టాండ్. జీఎన్‌టీ రోడ్డుకు పక్కనే ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ వుండడంతో నగరంలో ఎక్కువశాతం ఆటోలు, టౌన్‌బస్సులు జీఎన్‌టీ రోడ్డు మీదే తిరగాల్సివస్తుంది. బస్టాండ్ నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు జీఎన్‌టీ రోడ్డు గుండానే బస్టాండ్‌కు రావాల్సి వుండడంతో ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగానే వుంటుంది.*

అంతేకాదు, పెరిగిన బస్సులు, పెరుగుతున్న ప్రయాణీకులను చూస్తే ఇప్పుడున్న బస్టాండ్ ఎంతమాత్రం సరిపోవడం లేదు. ఒక బస్సు ప్లాట్‌ఫాం మీద వుంటే ఇంకో బస్సు దానివెనుకే వెయిటింగ్‌లో వుండాల్సి వస్తుంది. ఒక బస్సు వెళ్తేగాని ఇంకో బస్సు ప్లాట్‌ఫాంలోకి రాని పరిస్థితి వుంది. ప్రతి రోజూ నెల్లూరు బస్టాండ్‌కు 800కుపైగా బస్సులు వస్తుంటాయి. రూరల్ గ్రామాలకు వెళ్లే బస్సులు, రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రాంతాలకే కాక చెన్నై, బెంగుళూరు వంటి ఇతర రాష్ట్రాల నగరాలకు కూడా పెద్ద సంఖ్యలో బస్సులు నడుస్తున్నాయి. విశాఖపట్నం నుండి మొదలుకొని కోస్తాలోని ప్రతిజిల్లాలో ప్రతి డిపో నుండి తిరుపతికి వెళ్లే బస్సులు నెల్లూరు బస్టాండ్‌కు రావాల్సిందే! ఎంతో రద్దీగా వుండే బస్టాండ్ మరెంతో ఇరుకుదైంది. ఈ బస్టాండ్‌ను మార్చాలనే విషయంపై చాలారోజులుగా చర్చలు జరుగుతున్నాయి. మొన్న నెల్లూరు వచ్చిన శాసనసభా కమిటీ సభ్యులు కూడా నెల్లూరు బస్టాండ్ ఇంత చిన్నదిగా వుందేంటంటూ ఆశ్చర్యపోయారు. చెన్నైలో కోయంబేడు బస్టాండ్‌లాగా మరో 50 సంవత్సరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నెల్లూరులో కొత్త ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించాల్సివుంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది.

మొదట బుజబుజనెల్లూరు వద్దగల చెరువు ప్రాంతంలో బస్టాండ్‌ను మార్చాలనుకున్నారు. అయితే అది నగరానికి మరీ దూరమవుతుందని తిరస్కరిస్తున్నట్లు తెలుస్తుంది. ఆర్టీవో ఆఫీసు వద్ద ప్రభుత్వస్థలం పెద్దవిస్తీర్ణంలోనే వుంది. చాలాకాలం నుండి కూడా బస్టాండ్‌ను ఇక్కడికి మారిస్తే బాగుంటుందనే అభిప్రాయముంది.

కాగా నెల్లూరు ఆర్టీసీలో ఒకటి, రెండు డిపోలున్నాయి. వీటిలో ఒక డిపోకు మినీబైపాస్‌రోడ్డులో వున్న వేణుగోపాల స్వామి దేవస్థానం స్థలం కోరినట్లు తెలుస్తుంది. అయితే దేవాదాయశాఖకు చెందిన ఆ స్థలాన్ని తీసుకోవడం సాధ్యమయ్యేపని కూడా కాదు. ఇక్కడకు ఒక డిపోను మార్చేసి, పాత డిపో స్థలాన్ని కొత్త ప్లాట్‌ఫాంలు కట్టడానికి వాడుకోవాలనే ఆలోచన వుంది. అయితే ఇది తాత్కాలిక పరిష్కారమేగాని శాశ్వతంగా సమస్య తీరదు. ఆర్టీసీని ఆర్టీవో ఆఫీసు ప్రాంతంలోకి మార్చడమే అన్ని విధాలా శ్రేయస్కరం. నగరంలో ట్రాఫిక్ కూడా బాగా తగ్గి ఇంకా కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందే అవకాశముంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చొరవచూపించాల్సిన అవసరముంది.

ఈ విషయంపై గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మద్దాడ రవిచంద్ర తయారుచేసిన ప్రతిపాదనలు కూడా మన అధికారుల దగ్గర సిద్ధంగానే వున్నాయి. మరింకెందుకో ఆలస్యం...?

PDF Compressor Free Version






## తేల్చేయవచ్చు కదా!

రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సమస్యను నాన్చడం కాంగ్రెస్‌కు తగదు. వీళ్లు సమస్యను ముదరపెట్టే కొద్దీ రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుంది. ఈ రాష్ట్రానికి పెట్టుబడులే రావడంలేదు. ఇప్పటికే వున్న పరిశ్రమలను మూతేసుకుని పోతున్నారు. తెలంగాణ ఇస్తారా? లేదా? అనేది తేల్చిచెప్పడమే శ్రేయస్కరం.

గుండి వాసుదేవరావు,
హైదరాబాద్.

## శభాష్ కిరణ్

హైదరాబాద్‌లో ఓవైసీ సోదరుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రయత్నం అభినందనీయం. చట్టానికి మేం అతీతులం అన్నట్లు ఇంతకాలం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు వ్యవహరిస్తూ వచ్చారు. హైదరాబాద్‌లో వాళ్లెన్నో సార్లు చట్టాలను అతిక్రమించినా ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ వుండి పోయింది. ఇంతకాలానికైనా వారిని అదుపులో పెట్టేలా చేయడం సముచితం.

వై.వి.భాస్కర్, నెల్లూరు.

## కాంగ్రెస్ ఏమిచ్చినట్లు

రాష్ట్రంలో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం నడిచింది. తొలి 5ఏళ్ళు వై.యస్. విపరీతంగా వరాలిచ్చాడు. సబ్సిడీలు కుమ్మరించారు. చెప్పలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాడు. ఎటువంటి ఫీజులు, పన్నులు పెంచలేదు. మరి కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చాక ఫీజులు, పన్నులు, ఛార్జీలు పెంచేసాడు. వై.యస్. ప్రజలకు ఇచ్చిన దానికంటే కిరణ్ వారి వద్ద నుండి లాక్కున్నది ఎక్కువ. ఈ లెక్కనచూస్తే కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజలకు ఏం చేసినట్లు?

పమిడి జనార్ధన్‌నాయుడు,
నెల్లూరు.

## రాహుల్ పనికిరాడు

ముదురు బ్రహ్మచారి రాహుల్ గాంధీ రాజకీయాలకు పనికిరాడు. ఆయన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికకావడం యాధృచ్ఛికమే. రాహుల్‌కు దేశచరిత్ర అంతగా తెలియదు. సోనియాగాంధీ ఇప్పటికీ పేపరు చదువుతూ ఉపన్యసిస్తుంది. రాహుల్ అచేతనుడు కాకుండా సమర్థుడిగా ఎదగాలి.


వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## 'ప్రభా'తం

మహాభారతంలో లేని విషయమేదీ ప్రపంచంలో లేదు. ప్రపంచంలో వున్నదంతా మహాభారతంలో వుంది. మహాభారతం ఒక జీవితసత్యం. ఒక జీవనసాక్ష్యం. నేడు నడుస్తున్న ప్రపంచ రాజకీయ చిత్రానికి సజీవ రూపం.

రాజకీయాలలో మహాభారతాన్ని స్ఫూర్తిగా తీసుకోవడంలో కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ ముందే వుంటుంది. ఎందుకంటే మహాభారతంలో అంతో ఇంతో మిగిలిపోయిన రాజకీయ విన్యాసాలు మనకు కాంగ్రెస్‌పార్టీలో కనిపిస్తుంటాయి. రాజకీయం అన్నది తెలుసుకోవాలంటే, నేర్చుకోవాలనుకుంటే అందుకు కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే సరైన మార్గం. రాజకీయాలలో ఎవరికైనా ప్రధానలక్ష్యమైనా, అంతిమ గోలైనా అది అధికారమే. ఈ దేశంలో అత్యంత ఎక్కువగా అధికారాన్ని రుచిచూసిన పార్టీ కాంగ్రెస్. కాబట్టి అధికారం కోసం ఆ పార్టీ ప్రజలను కులమతాల పేరుతో చీల్చగలదు. కులాల ప్రాతిపదికన పథకాలు, మతాల పేర రిజర్వేషన్లు వంటివి ప్రవేశపెట్టగలదు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా చలికాచుకోనూగలదు.

ఇప్పుడు తెలంగాణ అంశంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ అటువంటి రాజకీయ ప్రయోగాలకే పాల్పడుతుంది కాంగ్రెస్‌పార్టీ. తెలంగాణ సమస్యకు ఆజ్యంపోసి ఈ రాష్ట్రాన్ని నిలువునా తగలబడేలా చేసింది కేంద్రంలోని కాంగ్రెస్ అధిష్టానం.



### కాంగ్రెస్‌మార్క్ రాజకీయం

సమస్యను సమస్యగానే వుండనిస్తేనే అది కాంగ్రెస్‌పార్టీ అవుతుంది. సమస్యను పరిష్కరిస్తే ఆ పార్టీని జనం మర్చిపోతారు. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం నాన్చుడు ధోరణి రాష్ట్ర ప్రగతికి తీవ్ర ప్రతిబంధకంగా మారుతుంది. తెలంగాణ ఇస్తారో లేదో తేల్చేస్తే కొంతకాలానికన్నా రాష్ట్రం చల్లబడుతుంది.

దివంగత నేత వై.యస్.రాజశేఖర రెడ్డి వున్నంతకాలం తెలంగాణ సమస్య చచ్చిన పాములా పడివుండింది. దీనిమీద ధైర్యంగా నోరెత్తి మాట్లాడినవాడు లేడు. తెలంగాణ అగ్నికి ఆజ్యం పోసిన కేసీఆర్ అయితే అడ్రస్ లేకుండా పోయాడు. కాని వై.యస్. మరణించాక తెలంగాణలో ఏలికపాములు సైతం మేం అనకొండలమన్నట్లు లేచి ఆడాయి. అప్పటిదాకా ఫామ్ హౌసుల్లో దాక్కున్న కేసీఆర్ బయటకొచ్చి బూటకపు నిరాహారదీక్ష చేయడం, కేంద్రం దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేయడం జరిగింది. 2009 డిసెంబర్‌లో కేంద్ర హోం మంత్రిగా వున్న చిదంబరం చేసిన ప్రకటనతో రాష్ట్రం సర్వనాశనమైపోయింది. కనీసం ఆరోజు తెలంగాణ స్టాండ్ మీదన్నా కేంద్రం నిలబడి వుండుంటే ఇదివరకు పరిస్థితి ఒక కొలిక్కివచ్చివుండేది. కాని దానిమీద కూడా నిలబడకుండా తెలంగాణ ప్రకటనను ఉపసంహరించుకునేసరికి ఆ ప్రాంతంలో ఆందోళనలు మొదలయ్యాయి. దీంతో తెలంగాణ ఎక్కడ ఇస్తారోనని భ్రమతో ఆంధ్రావాళ్లు చేసే ఉద్యమాలు, తెలంగాణ ఇవ్వాల్సిందేనంటూ ఆ ప్రాంతవాసులు చేస్తున్న ఆందోళనలతో రాష్ట్రం ఇప్పటిదాకా పూర్తిగా తగలబడుతూ వచ్చింది.

మంటలను చల్లార్చే పనులు కాంగ్రెస్ ఎప్పుడూ చేయదనడానికి నేడు రాష్ట్ర రాజకీయ పరిస్థితులే పెద్ద ఉదాహరణ. తెలంగాణ సమస్యపై తాడోపేడో నెలలో తేల్చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి సుశీల్‌కుమార్ షిండే నెలక్రితమే చెప్పారు. జనవరి 28వ తేదీకి ఆయన పెట్టిన నెలగడువు తీరుతుంది కాబట్టి కేంద్రం సమస్యను తెంపేస్తుందనుకున్నారు. కాని నెల అనే పదానికి కాంగ్రెస్ పెద్దలు లెక్కలనే మార్చారు. నెల అంటే 30రోజులు కాదని... పది, ఇరవైరోజులు అటుఇటుగా వుండొచ్చని కొత్త నిర్వచనం చెప్పారు. కాంగ్రెస్ అనుకుంటే వారాలు, నెలలనే కాదు సంవత్సరానికి 365రోజులే కాదు వందరోజులు అటు ఇటుగా వుండొచ్చని కూడా చెబుతుంది. షిండే చెప్పిన 28వ తేదీ గడువు దాటిపోయింది. ఆ తేదీలోపు తెలంగాణ పై స్పష్టత ఇవ్వకపోవడంతో సీమాంధ్ర నాయకులు హుషారయ్యారు. రాజమండ్రిలో ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమైక్యాంధ్ర సభ తెలంగాణ నేతల గుండెల్లో మంటలు పెట్టింది. తెలంగాణను అడ్డుకున్నామన్నట్లుగా వీరు సభ జరిపేసరికి తెలంగాణనేతలు ఉక్రోషంతో ఊగిపోతున్నారు.

తెలంగాణపై ఇంకా కూర్చుని చర్చించే దిశగానే కాంగ్రెస్ మాట్లాడుతుంది. 2009డిసెంబర్‌లో తెలంగాణ ప్రకటన చేయకపోయివుంటే ఈరోజు తెలంగాణ సమస్య ఈ స్థాయిలో వుండేది కాదు. ఎప్పుడో సద్దుమణిగివుండేది. కాని ఒకసారి ఇస్తామని కేంద్రం ఆశచూపాక ఇక తెలంగాణవాళ్లు ఊరుకుంటారా?

ఇక ఎంతోకాలం నాన్చగల స్థితిలో తెలంగాణ అంశం లేదనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలంటే ఎలా? విభజించాలంటే ఏ విధంగా? అనే అంశాలమీద కేంద్రం దృష్టిని కేంద్రీకరించాలి. సమైక్యంగా వుంచాలనుకున్నప్పుడు ఆ దిశగా ప్రకటన చేస్తే సరిపోతుంది. తెలంగాణలో గొడవలు జరుగుతాయి, ఉద్యమాలు రేగుతాయి... అయితే ఎల్లకాలం చేస్తూపోలేరుగా! ప్రతిరోజూ పనులు మానుకుని ఉద్యమాలు చేస్తూవుండలేరుగా! ఈ విధంగా తలెత్తే పరిణామాలను ఎదుర్కోవడానికి సిద్ధపడితే రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడానికే కేంద్రం సిద్ధపడాలి.

జగన్‌ని దృష్టిలో పెట్టుకునిగాని ఇంకే కోణంలోనైనాగాని రాష్ట్రాన్ని రెండుముక్కలు చేయాలనుకుంటే ఆ దిశగానన్నా సత్వర నిర్ణయం తీసుకోవాలి. అయితే నీటి ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు వంటివాటిపై ముందుగా స్పష్టత అవసరం. అలాగే రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఇంతకాలం ఇరుప్రాంతాల నిధులతోనే అభివృద్ధి చేస్తూ వచ్చారు కాబట్టి, కొత్తగా ఏర్పడే రాష్ట్రానికి కూడా రాజధానిని ఇరుప్రాంతాలకు చెందిన నిధులతోనే అభివృద్ధి చేయాల్సి వుంటుంది. రెండో రాష్ట్రానికి ప్రత్యామ్నాయ రాజధాని ఏర్పాటయ్యే వరకు హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా వుంచవచ్చు.

మనసుంటే మార్గముంటుందన్నట్లు తెలంగాణ సమస్యను శాంతంగా పరిష్కరించాలంటే కాంగ్రెస్ ముందు ఎన్నో మార్గాలున్నాయి. ఏ మార్గంలో ఈ సమస్యకు తెరదించదలచినా కొంతకాలం ఉద్రిక్తతలు, ఆందోళనలు తప్పవు. కాని కాంగ్రెస్ ఈ దిశగా ఆలోచించడం లేదు. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచితే ఎన్ని సీట్లొస్తాయి... విభజిస్తే ఎన్ని సీట్లు వస్తాయి అనే లెక్కలపైనే దృష్టిపెట్టింది. ఆ లెక్కల్లో స్పష్టత రాకే తెలంగాణ సమస్య కోణాన్ని కొత్త అద్దంలో చూపించే ప్రయత్నం చేస్తుంది.

## 'అంతర్'జాతీయం

- 64వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు 26వ తేదీ దేశమంతటా వైభవంగా జరిగాయి. ఢిల్లీలో జరిగిన వేడుకలలో భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేసి సైనిక గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ వేడుకలకు భూటాన్ రాజు వాంగ్‌చుక్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సైనిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.
- అత్యుత్తమ విదేశాంగమంత్రుల్లో హిల్లరీక్లింటన్ ఒకరని అమెరికా అధ్యక్షుడు ఒబామా ప్రశంసించారు. త్వరలోనే ఆమె విదేశాంగ మంత్రిత్వ బాధ్యతలనుండి వైదొలుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా హిల్లరీ ఎన్నో విజయాలను సాధించిందని ఒబామా కితాబిచ్చారు.
- బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోడీనే ప్రకటించాలని, దీనివల్ల పార్టీకి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆ పార్టీ సీనియర్ నేత యశ్వంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. మోడీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న జెడి(యు) కూడా పరిస్థితులను అర్థం చేసుకోవాలని, కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా మోడీనే ప్రధానిగా కోరుకుంటున్నారని అన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నేత రామ్‌జఠ్మలానీ కూడా మోడీనే ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేయడం విశేషం.
- 2014 ఎన్నికలలో తమ పార్టీ అధికారంలోకి వస్తే రిటైల్ రంగంలోకి ఎఫ్‌డిఐలకు అనుమతిస్తూ యూపీఏ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తామని బీజేపీ అధ్యక్షులు రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించారు.
- స్వాతంత్ర్య సమరయోధులకు దురంతో ఎక్స్‌ప్రెస్‌లలోనూ ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తూ రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీచేసింది.
- గూర్ఖాలాండ్ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోనే ఒక భాగంగా వుంటుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. మంగళవారం డార్జిలింగ్‌లో జరిగిన ఉత్తరబెంగాల్ పండుగ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దంటూ గూర్ఖాజనముక్తి మోర్చా కార్యకర్తలకు సూచించారు.
- ఢిల్లీ గ్యాంగ్‌రేప్, హత్య కేసు విచారణను ఢిల్లీ వెలుపలకు మార్చాలని ఓ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.
- మంగళవారం ఖజకిస్తాన్ ఉత్తరప్రాంతంలో విమానం కూలిన దుర్ఘటనలో 16మంది ప్రయాణీకులు, 5మంది సిబ్బంది మొత్తం 21మంది మరణించారు. దట్టమైన పొగమంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఆర్టీసీ నష్టాలు తగ్గాయ్. – ఆర్టీసీ ఎం.డి ఖాన్.
వ్యాఖ్య :- *బస్సులను, సిబ్బందిని తగ్గిస్తుంటే వాటిపాటికవే తగ్గుతాయి.*

వార్త :- యాత్రవల్ల షుగరొచ్చింది. – చంద్రబాబు.
వ్యాఖ్య :- *పొగరు పోయి షుగరు వచ్చె ధాం... ధాం.. అని పాడుకోండి.*

వార్త :- ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల్లో అవినీతిపరులు ఎక్కువ. – రచయిత ఆశీష్ నంది.
వ్యాఖ్య :- *అవినీతికి కూడా కులపిచ్చేనా?*

వార్త :- తెలుగుభాష తప్పనిసరి. – ముఖ్యమంత్రి ఆమోదం.
వ్యాఖ్య :- *ఇది ఆయన దగ్గర నుండే మొదలుపెడితే బాగుండు.*

వార్త :- తేదీ ప్రకటించడం వల్లే ఉద్రిక్తతలు. – సీఎంతో భేటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి వెల్లడి.
వ్యాఖ్య :- *తేదీ చెప్పారు గాని, ఏ నెల, ఏ సంవత్సరం చెప్పలేదుగా!*

వార్త :- నోరు అదుపులో ఉంచుకో! – కేసీఆర్‌కు రాయపాటి హెచ్చరిక.
వ్యాఖ్య :- *ఆయన నోరు అదుపులో వుండుంటే రాష్ట్రం ఈ రేంజ్‌లో ఎందుకుండేది.*

వార్త :- రాష్ట్ర సాధనకు ముందుండి కృషి చేస్తున్నాం. – మంత్రి జానారెడ్డి.
వ్యాఖ్య :- *ఇప్పుడు ముందుంటేనే కదా రేపు ముఖ్యమంత్రి రేసులోనూ ముందుండగలిగేది.*

వార్త :- ఆయన సీల్డ్‌కవర్ సీఎం. – కిరణ్‌పై కేటీఆర్, ఈటెల మండిపాటు.
వ్యాఖ్య :- *కాంగ్రెస్‌లో ఒక్క వై.యస్. తప్పితే అందరూ సీల్డ్‌కవర్ల బాపతే...*

వార్త :- ఇలాగైతే పార్టీలో వుండలేం. – సోనియాకు లేఖలో తెలంగాణ ఎంపీల ఆవేదన.
వ్యాఖ్య :- *మిమ్మల్ని వుండమని కాంగ్రెస్ అధిష్టానం కూడా కాళ్లు పట్టుకుని బ్రతిమలాడడం లేదుగా!*

వార్త :- అందరికీ ఆమోదమైన తీర్పు వస్తుంది. – తెలంగాణపై వయలార్ రవి.
వ్యాఖ్య :- *కాకపోతే ఏ సంవత్సరంలో వస్తుందో చెప్పలేమంటారు!*

PDF Compressor Free Version



# అంధుల పాఠశాలకు అజంతా స్కూల్ వితరణ



రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని నెల్లూరు వేదాయపాళెంలోని అజంతా ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థులంతా కలిసి లక్షరూపాయలు సేకరించి నెల్లూరులోని విశ్వనేత్ర అంధుల పాఠశాల విద్యార్థులకు అందజేశారు. బాలభవన్ డైరక్టర్ జి.సుభద్రాదేవి చేతులమీదుగా ఈ విరాళాన్ని అంద జేయడం జరిగింది. ఈ స్కూల్‌లో వున్న కొద్దిమంది విద్యార్థులే ఇంత పెద్దమొత్తం పోగేయడం ఆశ్చర్యం, ఆనందం కలిగించిందని సుభద్రాదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.జి.ఎస్ డిగ్రీ కాలేజీ ఇంగ్లీష్ రీడర్ వై.కృష్ణార్జునరెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ టి.వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

# దేశద్రోహి

(మొదటిపేజీ తరువాయి)

మత ఛాందస్తుడు పదిహేను నిముషాలు పోలీసులు పక్కకుపోతే వందకోట్ల మంది హిందువులు అంతుచూస్తామని వాగాడు. ఇప్పుడు అక్బరుద్దీన్ ఓవైసీ ఒంట్లో దూరా దేమో... కేసీఆర్ కూడా ప్రపంచ దేశాలన్నీ చేతులెత్తి నమస్కరించే సంస్కారం కలిగిన భారతదేశాన్ని దిక్కుమాలిన దేశమన్నాడు.

జనవరి 28వ తేదీ హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో తెలంగాణ రాజకీయ, ప్రజాసంఘాల జేఏసీ నిర్వహించిన 'సమరదీక్ష' సభలో కేసీఆర్ నోట వచ్చిన కారుకూతలు ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసాయి. జాతీయవాదుల మనసును గాయపరిచాయి. తెలంగాణ ఉద్యమం సాకుతో దేశాన్ని, జాతీయ నాయకులను తిట్టడాన్ని ఎవరూ సహించడం లేదు. ఇది దిక్కుమాలిన దేశం, పార్లమెంట్‌లో చప్రాసీ లకున్న జ్ఞానం ప్రధాని గానికి లేదు అంటూ ఆయన వాగడం దిగజారిన రాజకీయ నైతిక విలువలకు నిదర్శనంగా నిలుస్తుంది. దేశాన్ని అగౌరవపరిచేలా మాట్లాడిన కేసీఆర్‌పై అనేక చోట్ల కేసులు నమోదవు తున్నాయి. హిందువుల మనోభావాలను మొన్న అక్బరుద్దీన్ ఓవైసీ ఏ విధంగా గాయ పరిచాడో, ఇప్పుడు దేశ భక్తుల మనో భావాలను కూడా కేసీఆర్ అదేస్థాయిలో దెబ్బతీసాడు. కాబట్టి ఈ నికృష్టుడి మీద రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా కేసులు నమోదుచేసినా పాపం లేదు. కేసీఆర్‌ది నోరు కాదు, పందులు పొర్లాడే చెత్తదిబ్బ. ఆయన ఈ విధంగా మాట్లాడడం కొత్త కూడా కాదు. గతంలోనే సోనియా, వై.యస్.లను బజారుకీడుస్తానని గాలి మాటలన్నాడు. తలలు తెగుతాయి, రక్తం ఏరులై పారుతుందంటూ ఉగ్రవాదుల కంటే వికృతంగా ప్రకటనలు చేసాడు. ఇలా రెచ్చగొట్టే ప్రకటనలు చేసినప్పుడే అతని మీద కేసులు పెట్టి, జైల్లోపెట్టి, చిప్పకూడు పెట్టివుంటే నోరు కొంచెమన్నా అదుపులో వుండేది. కాని ఆరోజు వది లేయబట్టి ఈరోజు ఆయన నోటికి అదుపు లేకుండా పోయింది. దేశంలో ప్రత్యేక రాష్ట్రాల కోసం ఉద్యమాలు జరగడం కొత్తకాదు. గతంలో ఎన్నో జరిగాయి. ప్రస్తుతం కూడా పలు రాష్ట్రాలలో జరుగు తున్నాయి. అయితే ఏ ఉద్యమనాయకులు కూడా ఇంతగా నోటి దురుసుతనం ప్రద ర్శించలేదు. రాజకీయంగా నెహ్రూ, ఇందిరాగాంధీలతో విభేదించే రాజకీయ ప్రత్యర్థులు సైతం కేసీఆర్ లాగా వాళ్లపై ఎప్పుడు విమర్శలు చేయలేదు. ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై ప్రతిక్షణం విరుచుకుపడే బీజేపీ, ఇతర విపక్షాల నేతలు సైతం ప్రధానిని చప్రాసీలతో పోల్చలేదు.

రాజకీయంగానే కాదు, వ్యక్తిగతంగా కూడా సంస్కారం లేని అజ్ఞాని కేసీఆర్. ఇతనితో తెలంగాణ వస్తుందను కోవడ మంటే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదడమే.

## తెలంగాణ ఇస్తారనే భయమా!

ఒక వ్యక్తిచేత మనం తన్నించుకోవాలంటే వాడికి రోషం వచ్చేలా తిట్టాలి. ఇప్పుడు కేసీఆర్ అదే పని చేస్తున్నాడు. తెలంగాణ రావడం కేసీఆర్‌కు సుతారం ఇష్టం లేదు. తెలంగాణ వచ్చిందంటే ఇతనొక చప్రాసీగా మిగిలిపోతాడు. ఇతన్ని పట్టించుకునే వాళ్లు కూడా వుండరు. తెలంగాణ ఉద్యమం పేరుతో ఇప్పటికే వేలకోట్లు సంపాదించాడు. తెలంగాణ వస్తే ఆ సంపాదన ఆగిపోతుంది. తెలంగాణ సమస్య అలా మండుతుంటేనే కేసీఆర్‌కు రాజకీయ మనుగడ. ఇటీవల కేంద్రం తెలంగాణకు సానుకూల నిర్ణయం తీసుకోవచ్చుననే సంకేతాలు వెలువడ్డాయి. అప్పటినుండి కేసీఆర్‌లో భయం పట్టుకుంది. కాంగ్రెస్ అధిష్టానాన్ని రెచ్చగొట్టి, తెలంగాణ విషయంలో వాళ్లను వెనక్కుతగ్గేలా చేయాలనుకుని మాస్టర్‌ప్లాన్ వేసాడు. వాళ్లకు రోషం, పౌరుషం వచ్చే రీతిలో తిట్టాడు. కేసీఆర్ ఈ స్థాయిలో తిట్టాడుకాబట్టి కాంగ్రెస్ అధిష్టానం ఇక తెలంగాణ ఇచ్చేది లేదని మొండికేస్తుంది. కేసీఆర్‌కు కావాల్సిందదే! కాబట్టి కేసీఆర్ దేశానికే కాదు, తెలంగాణకు కూడా ద్రోహమే చేస్తున్నాడు. టి.ఆర్.యస్. ఆయనకు ఓ వ్యాపార సంస్థే తప్ప రాజకీయ పార్టీ కానేకాదు..!

# సిఎం వర్సెస్ ఆనం

(3వ పేజీ తరువాయి)

పంతం నెగ్గించుకోగలరో చూడాలి. ఇప్పటికే తొలివిడత ఎన్నికలు అయిపోయి కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ స్థానాలు వచ్చాయి. రెండో విడత జరగబోయే ఎన్నికలలోనూ అత్యధిక స్థానాలు కాంగ్రెస్‌కే రానున్నాయి. కాబట్టి ఛైర్మెన్ కుర్చీ విషయంలో ఎటువంటి మార్పు వుండదు. ఛైర్మెన్ కుర్చీ సుమంత్‌కా? ధనుంజయరెడ్డికా? అనేది రేపటి నుండి జరగ బోయే రాజకీయం.

## నాది ఏ వర్గమూ కాదు...

# నేను కేవలం పార్టీ కార్యకర్తను

**- 'లాయర్'తో సుమంత్**

కొంతమంది వ్యక్తులు, కొన్ని పత్రికలూ పనిగట్టుకుని తనపై ఆనం వ్యతిరేక ముద్రను వేస్తున్నారని, తాను ఎవరి వర్గమూ కాదని సుమంత్‌రెడ్డి చెప్తున్నాడు. తాను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తగానే బరిలో వున్నానని, ముఖ్యమంత్రితో వున్న సన్నిహిత సంబంధాల కారణంగానే తనపై ఆనం వ్యతిరేక బురదను చల్లుతున్నారని, జిల్లాలో ఆనం వారి నాయకత్వంలో పని చేయడానికి తాను అన్ని వేళలా సిద్ధంగా వున్నానని సుమంత్ చెప్పాడు. గతంలో కోవూరు ఉపఎన్నికల తరుణంలో సుమంత్ పేరుని ముందుగా ప్రచారంలోకి తెచ్చింది "లాయరే". ఆనాడు కూడా ఆనం ఆశీస్సులతోనే తాను కోవూరు అభ్యర్థిగా రంగంలో వున్నానే తప్ప వారికి వ్యతిరేకంగా కాదని సుమంత్ చెప్పిన మాటలని ఈ సందర్భంగా గుర్తు చేశాడు.

ముఖ్యమంత్రి ఆశీస్సులు తనకు వున్నది నిజమే కాని ఆనంకు వ్యతిరేక వర్గంగా తనను ప్రతిపాదిస్తున్నారన్నది వాస్తవం కాదని సుమంత్ చెప్తున్నాడు. రాజకీయాలలో రాణించాలంటే అన్ని వర్గాలనూ కలుపుకుపోయి పార్టీ పటిష్టతకు పనిచేయాలని, అదే లక్ష్యంగా తాను ముందుకు పోతున్నానని చెప్పాడు. తనపై కాంగ్రెస్ ముద్రే తప్ప మరే ముద్ర లేదని, వుండబోదని ఖచ్చితంగా చెప్పాడు.

# బస్తీమేసవాల్

(3వ పేజీ తరువాయి)

సోదరులు ఓటర్లకు గాలం వేస్తున్నారు. మేకపాటి సమీపబంధువు రవీంద్రరెడ్డి ఎన్నికల అధికారి వద్ద వున్న ఓటర్ల జాబితాను లాక్కుపోవడం, ఆయన మీద నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం కూడా జరిగింది. వైకాపా, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాటలు, వాగ్వివాదాలు లాంటి సన్నివేశాలు పూర్తయ్యాయి. రేపు 4వ తేదీ ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు సొసైటీల పరిధిలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసివున్నారు. ఎవరి పరువు నిల బడుతుందో, ఎవరి ప్రతిష్ఠ గంగలో కలు స్తుందో చూడాలి.

# చేతులెత్తేసినట్లే!

(3వ పేజీ తరువాయి)

పంచుకున్నాయి. ఇక బ్యాంకు ఛైర్మెన్ అభ్యర్థి విషయం గురించి కూడా తెలుగుదేశంపార్టీ ఆలోచన చేయలేకపోతుంది. అంటే వారి కంత నమ్మకం ఏర్పడింది... మాకు ఆ స్థాయిలో సీట్లు రావని. కాంగ్రెస్ నుండి బ్యాంకు ఛైర్మెన్ పదవికి ఒకరికి ముగ్గురి పేర్లు (మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సుమంత్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి) వినిపిస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ నుండి సూరా శ్రీనివాసులురెడ్డి, బాలచంద్రారెడ్డి పేర్లు తెరమీదకొచ్చాయి. కాని ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం నుండి ఆ ఊసే లేకపోవడం జిల్లాలో ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది.

# అధికారానికే సహకారం



సమావేశంలో పాల్గొన్న కాకాణి, మేకపాటి, కొమ్మి

సహకార సంఘాల ఎన్నికలలో అధికారపార్టీ అధికారదుర్వినియోగానికి హద్దు లేకుండా పోయిందని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయని, ప్రజాకోర్టులో వైయస్సార్ కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం చేతకాని కాంగ్రెస్, తెలుగుదేశంలు సిద్ధాంతాలు, రాజకీయ విలువలు వదిలేసి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని, డైరక్టర్ల స్థానాలను పంచుకుని కలిసి వైయస్సార్సీపి అభ్యర్థుల మీద పోటీకి దిగుతున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్‌కు అనుకూలంగా వున్న రైతుల ఓట్లను తొలగించి, భూములు లేకపోయినా కాంగ్రెస్‌వాళ్ల ఓట్లను మాత్రం నెల్లూరులోని లాడ్జిలలో అధికారులను కూర్చోబెట్టి చేర్పించారని కాకాణి ఆరోపించారు. టి.పి.గూడూరు మండలం పేడూరు సొసైటీలో సుబ్బమ్మ అనే ఎస్టీ మహిళ జగన్ మీద అభిమానంతో పోటీకి సిద్ధమవగా స్థానిక ఎస్.ఐ ప్రమేయం లేకుండా సిఐ గంగా వెంకటేశ్వర్లు ఆమెను తీసు కెళ్లి ముత్తుకూరు స్టేషన్‌లో పెట్టారని, ఒక పోలీసు అధికారిగా వుంటూ అధికారపార్టీకి దళారిగా వ్యవహరించిన వెంకటేశ్వర్లుపై చర్య తీసుకోవాలని కాకాణి డిమాండ్ చేసారు. ఆయనపై శాఖా పరంగా చర్యలు తీసుకోకపోతే కేంద్ర, రాష్ట్ర మానవహక్కుల సంఘా లకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వరిగొండ, పేడూరు, కృష్ణపట్నం సొసైటీలలో టిడిపికి కాంగ్రెస్ మద్దతు పలికిందని, తమకు అనుకూలంగా లేని ఐదుస్థానా లలో కాంగ్రెస్ నాయకులు స్టేలు తెచ్చి ఎన్నికల వ్యవస్థకే కళంకం తెచ్చారని అన్నారు.

ఈ సమావేశంలో వైయస్సార్సీ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వరూపం

*భారతదేశమే గర్వించదగ్గ మహానటుడు కమలహాసన్... ఆ మేటి నటుడు ఈరోజు దేశం వదిలిపోతాననంటున్నాడు. దీనికి కారణం ఎవరు? కుళ్లు రాజకీయాలు కావా? కుతంత్రపు చేష్టలు కావా?*

తమిళ సినీరంగంలోనే కాదు, ప్రపంచ చలనచిత్ర పరిశ్రమలోనే కమలహాసన్ పోషించినన్ని విభిన్న పాత్రలను ఇంకెవరూ పోషించి వుండరు. పోషించడమేకాదు ఆ పాత్రలో ఇమిడిపోయి ప్రేక్షకులను మెప్పించడం సైతం ఆయనకే చెల్లింది. ఎన్నో ఆణిముత్యాల్లాంటి చిత్రాలను ప్రేక్షకులకు అందించి రంజింపచేసిన కమల్ ఈరోజు కష్టాల్లో పడ్డాడు. ఎన్నో సెంటిమెంట్ సీన్లలో ప్రేక్షకుల చేత కంటతడి పెట్టించిన ఈ మేటి నటుడు ఈరోజు తానే కన్నీరు పెడుతున్నారు. దీనికి కారణం తమిళ అధినేత్రి, ముఖ్యమంత్రి జయలలిత.

కమలహాసన్ ఏ సినిమానైనా కొత్తదనంతో తీస్తాడు. నూరుకోట్ల వ్యయంతో ఈ కోణంలో తీసిందే 'విశ్వరూపం'. ఈ సినిమా కోసం ఆయన తన ఇంటిని సైతం తాకట్టుపెట్టాడు. సినిమా విడుదల రోజునే డిటిహెచ్ హక్కులను కూడా రిలీజ్ చేయడంతో డిస్ట్రిబ్యూటర్లు కోర్టుకెక్కారు. ఆ కష్టాలను దాటుకుని ఎలాగోలా సినిమాను విడుదల చేశారు. అయితే ఆ సినిమాలో తమ మనోభావాలను దెబ్బతీసే సన్నివేశాలున్నాయంటూ ముస్లింలు ఆందోళన చేయడం మొదలుపెట్టారు.

దీనిని జయలలిత అస్త్రంగా చేసుకుంది. తమిళనాడులో ఆ సినిమాను నిషేధించింది. ఒక రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవతీసుకుని ఏ సినిమాను కూడా ఆపిన దాఖలాలు లేవు. కాని 'కమల్' విశ్వరూపం విషయంలో జయలలిత తన విశ్వరూపం చూపింది. మద్రాసు హైకోర్టు సినిమాపై నిషేధాన్ని ఎత్తివేసినా అర్ధరాత్రి మళ్ళీ అప్పీలుకు వెళ్ళి ఫుల్‌బెంచ్ నుండి "స్టే" తెప్పించిందీ "మమ్మీ".

"మమ్మీ(ఈజిప్ట్ మమ్మీ) ఈజ్ బ్యాక్" అని ఆమె మళ్ళీ ముఖ్యమంత్రైనప్పుడు షికారు చేసిన యస్.యం.యస్‌లను ఆమె నిజం చేసింది. కమల్‌పై ఆమె ఎందుకు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందా అని ఆరాతీస్తే కొన్ని ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ఇటీవల కమల్‌హాసన్, రజనీకాంత్‌లు కరుణానిధి అధ్యక్షతన జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని కరుణను పొగిడారు. అది అమ్మవారికి నచ్చలేదు. అలాగే కేంద్ర ఆర్థికశాఖమంత్రి పి.చిదంబరం వ్రాసిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన కమల్ 'చిదంబరం'కు ప్రధాని కాగల అర్హతలున్నాయని ప్రశంసించారు. ఇంకేముంది అమ్మగారికి కడుపులో కారం పోసినట్లయ్యింది. ఇక 'విశ్వరూపం' డిటిహెచ్ ప్రసారాల హక్కుల కోసం జయలలిత సొంత ఛానెల్ జయ టీవీ, దయానిధి మారన్‌ల సన్‌నెట్‌వర్క్ పోటీపడ్డాయి. కోటి రూపాయలు తక్కువైనా కూడా టీఆర్‌పి రేటింగ్ ఎక్కువగా వుండడంతో సన్ నెట్‌వర్క్‌కే కమల్ విశ్వరూపం హక్కులు ఇచ్చేసాడు.

దీంతో జయ కక్ష సాధింపుచర్యలకు పూనుకుంది. తాను ఒకనాడు సినీనటినేనన్న ఇంగితజ్ఞానం మర్చిపోయి సాటి నటుడిని ఇబ్బందుల పాల్జేయసాగింది. భారత దేశ చలనచిత్ర కళామతల్లి ముద్దుబిడ్డ కమల్ చేతే కన్నీళ్లు పెట్టించింది... ఈ పాపం పూరికే పోతుందా...!

PDF Compressor Free Version





జనవరి 28వ తేదీన కృష్ణపట్నం పోర్టును సందర్శించి సముద్రంలో బోటులో విహరిస్తున్న ఏపి లెజిస్లేటివ్ కమిటీ ఆన్ పబ్లిక్ అండర్ టేకింగ్స్ ఛైర్మెన్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, ఆర్డీవో మాధవీలత

# నెల్లూరు కబుర్లు



## ముఖ్యమంత్రి పర్యటనకు సన్నాహాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటన దాదాపు ఖరారైనట్లే. ఈనెల 7, 8, 9తేదీలలో ఆయన పర్యటన వుంటుంది. 8వతేదీ పర్యటన అంతాకూడా ఆత్మకూరు నియోజకవర్గంలో వుంటుంది. ఈమధ్య ముగ్గురు మంత్రులు (ఆనం, పట్టి, పితాని)లు కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి సీఎం కోసం కొన్ని పనులను మిగిల్చారు. వాటికి కిరణ్ శంకుస్థాపన చేస్తారు. 9వ తేదీ పర్యటన మొత్తం నెల్లూరులోనే! ఇరుకళలమ్మ గుడి నుండి దొడ్ల డెయిరీ వరకు నాలుగులైన్ల రహదారి, సంతపేట నుండి పోలీస్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ, మినీబైపాస్ ఆరులైన్లు, అయ్యప్పగుడి నుండి శబరి శ్రీరామక్షేత్రం వరకు రోడ్డు విస్తరణ, మాగుంట బొమ్మ నుండి నెహ్రూ బొమ్మ వరకు సిమెంట్‌రోడ్డు, ఎస్ఆర్‌కె స్కూల్ నుండి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కళ్యాణ మండపం వరకు గొలగమూడి రోడ్డు విస్తరణ పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. అలాగే పెద్దాసుపత్రి ప్రాంగణంలో ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణానికి, మాగుంట లే అవుట్‌లో 5కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఇండోర్‌స్టేడియం మరియు రిక్రియేషన్ సెంటర్‌కి ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారు. ఈ తేదీలు అధికారికంగా ఖరారు కావాల్సివుంది.

### నెక్‌వ్యవస్థాపకుడు

## డా॥ బి.వి.రావు వర్ధంతి



డా॥ బి.వి.రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నెక్ సభ్యులు

భారతదేశ కోళ్ళ పరిశ్రమ పితామహుడు, జాతీయ గుడ్ల సమన్వయ సంఘం(నెక్) వ్యవస్థాపకుడు పద్మశ్రీ డా॥ బి.వి.రావు 17వ వర్ధంతి జనవరి 26న నెల్లూరులో జరిగింది. ఈ సందర్భంగా నెక్ మాజీజోనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో నవాబుపేట, ముకుందాపురం, బాలాజీ అండ్ ఎస్ఎస్ హేచరీ కార్యాలయాల్లో డా॥ బి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉడికించిన కోడిగ్రుడ్లను స్వర్ణభారత్ ట్రస్టు, బి.వి.రావ్ & ఉత్తరాదేవి మెమోరియల్ ఆసుపత్రి, బ్రిడ్జి స్కూలు విద్యార్థులకు, వియానిహోం వికలాంగులకు, వాత్సల్య బాలబాలికల సంక్షేమ సదనంలో, విశ్వోదయ అంధుల పాఠశాలలో, విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యం.ఆర్.ప్రసాద్, కమిటీ మెంబర్లు కె.రాఘవరావు, పి.శివరామయ్య, పి.వెంకట్రామయ్య, మురళి సుధాకర్‌రెడ్డి, శేషాద్రి, రత్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రెయిన్‌బో స్కూలు విద్యార్థుల ప్రతిభ



మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలైన రెయిన్‌బో విద్యార్థులు

అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో నగరంలోని మాగుంటలేఅవుట్ రెయిన్‌బో స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రెయిన్‌బోస్కూలు డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం అభినందించారు. 6వతరగతి విభాగంలో వి.సాయిసతీష్ అంతర్జాతీయస్థాయిలో 3వర్యాంకు, రాష్ట్రస్థాయిలో 1వర్యాంకు సాధించాడు. పి.ఎస్.ఎల్.సంశ్రీయ అంతర్జాతీయస్థాయిలో 15వ ర్యాంకు రాష్ట్రస్థాయిలో 9వర్యాంకు, విశ్వనాథరెడ్డి అంతర్జాతీయ స్థాయిలో 149, రాష్ట్రస్థాయిలో 98వర్యాంకు సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సంఘం నివాళి

2005-06 సంవత్సరంలో రాష్ట్ర డి.జి.పిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సుకుమార్ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో నెల్లూరుజిల్లా పోలీస్ అధికారుల సంఘం గత నెల 26న నివాళులర్పించింది. సంఘం కార్యాలయంలో పోలీసు అధికారులు జి.మాధవరెడ్డి, వై.శ్రీహరిబాబు, బి.శివకుమార్, ప్రసాద్‌లు ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ కార్యాలయ నిర్మాణ భవనానికి నిధులు మంజూరు చేశారని, అదే విధంగా 2005 పిఆర్‌సిలో కానిస్టేబుళ్ళకు జూనియర్ అసిస్టెంట్లుగా కేడర్ కల్పించేందుకు కృషి చేశారన్నారు.

### ఫిబ్రవరి 21న

## రెడ్‌క్రాస్ సమావేశం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నగరంలోని రెడ్‌క్రాస్ ఆవరణంలో ఫిబ్రవరి 21న జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ తెలిపారు. సొసైటీకి సంబంధించిన జీవిత సభ్యులు, పాలకమండలి సభ్యులు, కార్యవర్గ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## జీవవైవిధ్య పరిరక్షణే లక్ష్యం

నెల్లూరు నవాబుపేటలోని బంగ్లాతోట కమ్యూనిటీ హాలులో గతనెల 28న లక్ష్మి అరుంధతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ప్రాంతీయ వనరుల కేంద్రం జిల్లా పరిశీలకులు పి.జోసెఫ్ మాట్లాడుతూ మానవ మనుగడకు మూలాధారమైన ఆక్సిజన్ చెట్ల ద్వారానే లభిస్తుందని అన్నారు. అవగాహన లేమితో మొక్కలను నరికేస్తే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని పేర్కొన్నారు. విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ జి.చంద్రశేఖరం మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణ మన తక్షణ కర్తవ్యమన్నారు. యం.ఆర్.పి.యస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పోలయ్య మాట్లాడుతూ ముత్తుకూరు థర్మల్ పవర్‌స్టేషన్ల కోరల్లో చిక్కుకుని కాలుష్యంతో విలవిలలాడుతున్న నెల్లూరుజిల్లాను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు ఒక్కో మొక్కను నాటి పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు అమరావతి, పొదుపు మహిళలు, నాగయ్య, మన్నేపల్లి దాసు, వైవి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## వ్యాపారులకు ఊరట

పప్పుధాన్యాల ఎగుమతి అమ్మకం పన్ను 3శాతం నుండి 2శాతానికి తగ్గిస్తూ గతనెల 24న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు కె.వి.చలమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సిడిక్లరేషన్ ఫారం ఉంటేనే 2శాతం చెల్లించే విధంగా 2008 నుండి వున్న ఉత్తర్వులను ప్రభుత్వం సవరిస్తూ ఫారం లేకున్నా అదే విధంగా చెల్లించేలా చేసి వ్యాపారస్తులకు మేలు చేసినందుకు ప్రభుత్వానికి చలమయ్య కృతజ్ఞతలు తెలిపారు. గతంలో 2008 జూన్ నుండి 2009 మార్చి వరకు జరిగిన ఎగుమతులకు సంబంధించిన లావాదేవీలకూ ఇది వర్తిస్తుందని తెలిపారు.

## వేడుకగా "రత్నం" గణతంత్ర దినోత్సవం



జాతీయపతాకానికి వందనం చేస్తున్న రత్నం విద్యార్థులు

నెల్లూరు దర్గామిట్టలోని రత్నం ఒలింపియాడ్‌లో గణతంత్ర దినోత్సవం వేడుకలు విద్యార్థుల్లోని దేశభక్తిని చాటిచెప్పాయి. త్రివర్ణ పతాకాలతో విలసిల్లుతూ విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలతో, ప్రదర్శించిన నృత్యాలతో, ఆటపాటలతో, స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలియజేసిన ఉపాధ్యాయుల ఉపన్యాసాలతో పాఠశాల ఆవరణ గణతంత్ర దినోత్సవ ఉత్తేజం, ఉత్సాహంతో నిండిపోయింది. రత్నం స్కూల్స్ డైరెక్టర్స్ డా॥కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు జెండా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలుపగా, జనరల్ మేనేజర్ శ్రీరామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ కె.వి.డి మనోజ్‌కుమార్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

### సీమాంధ్ర కోసం

## జపాన్ తరహా ఉద్యమం



'సీమాంధ్రప్రగతికి సోపానం సీమాంధ్ర రాష్ట్రం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీమాంధ్ర విద్యార్థి జేఏసీ నాయకులు

నెల్లూరు రామలింగాపురంలోని విద్యార్థి భవన్‌లో జనవరి 27న సీమాంధ్ర యువజన విద్యార్థి సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో "సీమాంధ్ర ప్రగతికి సోపానం సీమాంధ్ర రాష్ట్రం" పుస్తకాన్ని రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయాల వల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన, సమైక్యవాద ఉద్యమాల్లో విద్యార్థులు, యువత నష్టపోకుండా నిరసన తెలపడానికి జపాన్ దేశంలోలాగా వినూత్న కార్యక్రమానికి సీమాంధ్ర యువజన విద్యార్థి జెఏసి శ్రీకారం చుడుతుందన్నారు. అధిక ఉత్పత్తి, అధిక శ్రమతో లాభాలు గడించే విధంగా ఉద్యోగులు, కార్మిక కర్షకులతో ప్రణాళిక రూపొందిస్తున్నామని, తద్వారా ఉద్యమతీవ్రత పెంచుతామన్నారు. కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర కో-కన్వీనర్ జంపాని ఆనంద్‌గౌడ్, బిఎస్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు కూరపాటి గోపాల్, కార్యదర్శి చిరంజీవి, సిటీ కన్వీనర్ గోవర్ధన్, మన్నెం రాముగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆన్‌లైన్ సదుపాయం

నెల్లూరు సర్వోదయ కళాశాల ప్రాంగణంలో మీ సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ దూరవిద్యాకేంద్రంలో విద్యార్థుల సౌకర్యార్థం ఏపి ఆన్‌లైన్ కేంద్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా॥వి.సోమశేఖరం ఆదివారం ప్రారంభించారు. డిగ్రీ పీజీ విద్యార్థులు పరీక్ష ఫీజులను ఏపి ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆయన సూచించారు. ప్రథమసంవత్సరం డిగ్రీ చేరదలచుకున్నవారు ఫిబ్రవరి 28వ తేదీలోగా అన్ని వివరాలతో 235రూపాయల ఫీజు చెల్లించి రిజిష్టరు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ కె.పి.మాధవ్ అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టిపల్లి మధుబాబు, ఉపాధ్యక్షుడు రాజు ఆదిశేషారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గోవింద నామస్మరణతో...
# మార్మోగిన మాగుంట లే అవుట్

## భక్తులను ఆధ్యాత్మికతతో ముంచెత్తిన తిరుమంజనం, కళ్యాణ మహోత్సవం





జనవరి 26వ తేదీ యావత్ భారతదేశం గణతంత్ర సంబరాలు జరుపుకుంటున్న శుభవేళ నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని పిచ్చిరెడ్డి కళ్యాణ మండపం తిరుమలేశుని నామస్మరణతో ఆధ్యాత్మిక చింతనతో పులకించిపోయింది. మాగుంట లే అవుట్ అభివృద్ధి కొరకు నూతనంగా ఏర్పడిన "మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్" కార్యవర్గం తమ పదవీ బాధ్యతలను చేపట్టిన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు, ధర్మప్రచార పరిషత్ మరియు లే అవుట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ భక్తి కార్యక్రమాన్ని భక్తులు వేలాదిగా తరలివచ్చి తిలకించారు.

ఉదయం 8గంటలా 30నిముషాలకు ప్రారంభమైన "తిరుమంజనం"(అభిషేకం) కార్యక్రమం 9.45నిముషాలకు ముగిసింది. మళ్లీ 11.15నిముషాలకు మొదలైన కళ్యాణవేడుక మధ్యాహ్నం 2గంటలకు 5గంటల సేపు జరిగిన ఈ రెండు కార్యక్రమాలను తిలకించి పులకించారు. కళ్యాణ ఘట్టం ముగిసిన అనంతరం నూతన కమిటీ సభ్యులకు స్వామివారి కండువాలను కప్పి బాధ్యతలు అప్పజెప్పే కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించారు. ఒక్కొక్కరుగా కమిటీ సభ్యులందరికీ ఆయన స్వామివారి సమక్షంలో బాధ్యతలను అప్పజెప్పారు. ఈ సందర్భంగా "మాగుంట సుబ్బరామరెడ్డి మెమోరియల్ పార్కు"నందు నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ మరియు మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ సంయుక్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

మాగుంట లేఅవుట్ వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రక్కనగల 60అడుగుల మెయిన్‌రోడ్డును దాదాపు రెండు కోట్ల రూపాయలతో ఆధునికీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రోడ్డుతో పాటు



## నూతన కమిటి ప్రమాణస్వీకారం - ఆర్థికమంత్రి హార్థిక సహకారం

పూర్తయ్యింది. కేవలం మాగుంట లే అవుట్ నివాసితుల కోసం ఏర్పాటు చేసిన ఈ శుభవేడుకలో 1500 మందికి పైగా భక్తులు పాల్గొని అభిషేకం, కళ్యాణాలను వీక్షించారు.

తిరుమల నుండి ప్రత్యేకంగా విచ్చేసిన వేదపండితులు యన్.టి.విష్ణువర్ధన్ గారి నేతృత్వంలో స్వామివారి సరసన శ్రీదేవి, భూదేవిలను అత్యంత సుందరంగా, అపురూపంగా, కన్నుల పండుగగా అలంకరించి తిరుమలలో జరిగే విధంగా "కళ్యాణ" ఘట్టాన్ని ఇక్కడ నిర్వహించారు. కార్యక్రమం జరుగుతున్నంతసేపూ ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీమతి బాలార్క ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలతో ఆడిటోరియం మార్మోగిపోయింది.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కళ్యాణ వైభోగాన్ని తిలకించడానికి రెండుకళ్ళు చాలవన్నట్లుగా స్వామివారి భక్తులు కార్యక్రమం ఆద్యంతం భక్తిభావంతో, క్రమశిక్షణతో మెలిగి దాదాపు మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జి నుండి బెజవాడ గోపాలరెడ్డి విగ్రహం వరకు రోడ్డు విస్తరణతో పాటు డ్రైనేజీ నిర్మాణం, లే అవుట్‌లో 5యకరాల స్థలంలో 5కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఇండోర్‌స్టేడియం మరియు రిక్రియేషన్ సెంటర్‌కు త్వరలో ముఖ్యమంత్రి చేత శంకుస్థాపన వంటి వరాలను ప్రకటించారు. లే అవుట్‌లో నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ సూచనలతో అవసరమైన అభివృద్ధికి నిధులను సమృద్ధిగా అందించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

నెల్లూరు శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తమ ఉపన్యాసంలో నూతన కమిటీకి శుభాకాంక్షలు అందజేస్తూ లే అవుట్ అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలను అందిస్తానన్నారు. డిసిసి బ్యాంక్ ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, నందిమండలం భానుశ్రీ, మునిసిపల్ కమీషనర్ టి.యస్.ఆర్.ఆంజనేయులు, హరిబాబుయాదవ్

(మిగతా 11వ పేజీలో)



PDF Compressor Free Version



కదంబం

# రూపాంతరం

దాట్ల దేవదానం రాజు
యానాం, 94401 05987.

అనుభవాలు కొన్ని
రహస్యంగా
మూసిన కంటిరెప్పల మాటున దాగిన
చూపుల్లా ఉంటాయి
క్షణం చాలేమో
తెర తొలగడానికి.

పరిమళం వెదజల్లాక
రాలిన వాడిన పూవు
పండిన ఎండిన ఆకు
మొక్కమొదలు
జీవమౌతాయిలే.

సారం పీల్చుకున్నాక
ఒక మొలకై
ఒక చిగురై చెట్టై
మట్టి...మట్టే
వికసిస్తుందిలే.

దాహాలు తీరాక
అడుగంటిన జల
తోడే కొలదీ
అమృతంలా
ఊరుతుందిలే.

ఇదేమిటీ, కంటి ముందు
చీకటి తచ్చాడుతుందీ...
గునపంతో పెకలించినట్టు
పార పీకేస్తే
ఆకుపచ్చని వెలుతురు నీడ
లోకం కొత్తగా
మరింత కొత్తగా
కనపడుతుందిలే.

ధ్వంసానంతర పునర్నిర్మాణం
పాత అడుగులు మాసిపోయి
నూతన సోయగాలతో
అలరారుతుందిలే.

# టీవీ బాధితుల గుండెల్లో దేవుడిగా కిరణ్

గల్పిక

రాష్ట్రముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి అద్భుత పాలన నచ్చి, ఆయన అమలు చేస్తున్న ఛార్జీలు, పన్నులు పెంపు విధానం మెచ్చి ప్రజలు ఒకటికి రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసారనుకుందాం... ఓ పదేళ్ల తర్వాత రాష్ట్రం ఏ స్థితిలో వుంటుంది. చూద్దాం...

హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కిరణ్ కార్యాలయం. ఆయన గదిలో నాలుగు పక్కలా నాలుగు కాగడాలు వెలిగించి వుండగా ప్యూన్‌లు అప్పుడప్పుడు ఆ కాగడాల మీద చమురు పోస్తున్నారు. ఆయన వెనుక ఇంకో ప్యూన్ నిలబడి పొడవాటి ఫంకాతో ఆయనకు గాలి విసురుతున్నారు. అప్పుడే సమాచారశాఖ మంత్రిణి డి.కె.అరుణ అక్కడకు వచ్చింది. సీఎం గారు... పిలిచారట అని అడిగింది. కిరణ్ వుండి... మన రాష్ట్రంలో ఇంకా చాలా మంది పేదల ఇళ్లలో దీపాలు లేవట... వున్నా కూడా చమురు లేక వెలిగించుకోలేకపోతున్నారట... కాబట్టి "ఇంటింటికి ఇందిరమ్మ లాంతరు" అనే పథకాన్ని ప్రవేశపెట్టాలనుకుంటున్నాను. అలాగే ప్రతి ఇంటికి నెలకు లీటరు చమురు ఉచితంగా ఇవ్వాలనుకుంటున్నాను అని చెప్పాడు. దానికి డి.కె.అరుణ... ఇలా చేస్తే మీరు ఈ రాష్ట్ర ప్రజల గుండెల్లో దీపమై నిలిచిపోతారు. వాళ్ల గుడిసెల్లో దీపాలు వెలిగించిన కీర్తి మీకే దక్కుతుందని పొగిడింది. అంతలో ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా వచ్చారు. ఏం రామనారాయణన్న, మన రాష్ట్ర ఆర్థిక పురోగతి ఎలా వుంది అని కిరణ్ అడిగాడు. దానికాయన... చాలా బాగుంది సీఎం గారు... గతంలో మన రాష్ట్ర వ్యాప్తంగా వున్న విద్యుత్ స్థంభాలను హైటెన్షన్‌లైన్ పరికరాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ తీగలను, ఇతరత్రా విద్యుత్ పరికరాలను వేలం వేయడం ద్వారా ఖజానాకు వేలకోట్ల రూపాయలు వచ్చిపడ్డాయి. అలాగే థర్మల్‌విద్యుత్ కేంద్రాలున్న స్థలాలను ఇండ్ల ప్లాట్లుగా మార్చి అమ్మడం ద్వారా కూడా వేలకోట్లు వచ్చిపడ్డాయి. మనమిప్పుడు ఇతర రాష్ట్రాలకు అప్పు ఇవ్వగలం సార్ అని చెప్పాడు. అంతలో దానం నాగేందర్, పొన్నాల లక్ష్మయ్య, జె.గీతారెడ్డి, వట్టి వసంతకుమార్, పితాని సత్యనారాయణలు కూడా అక్కడకు వచ్చారు. అందరితో కిరణ్ వుండి... రవీంద్రభారతిలో నాకు సన్మానం ఏర్పాటు చేసివున్నారు, అందరూ పోదాం రండి సరదాగా అని పిలిచాడు. సన్మానం ఎవరు చేస్తున్నారని దానం నాగేందర్ అడిగాడు. అందుకు కిరణ్... సీరియల్స్ బాధితుల సంఘం అట... నా వల్ల వాళ్లకేదో మంచి జరిగిందని చేస్తున్నారు. ఆ మంచేంటో మీతో పాటు నేనూ తెలుసుకుంటాను, పోదాం పదండి అంటూ లేచాడు.

రవీంద్రభారతి హాల్ అంతా పురుషులతో నిండిపోయింది. చూద్దామన్నా ఒక్క మహిళా కనిపించలేదు. స్టేజీ మీద మాత్రం 'సీరియల్స్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఘనసన్మానం' అని వ్రాసివుంది. ఆ సభకు అధ్యక్షత వహించిన సీరియల్స్ బాధితుల సంఘం అధ్యక్షులు కన్నీటి కనకారావు మాట్లాడుతూ... ఈ రాష్ట్రంలో భర్తలందరి పాలిట ఆపద్బాంధవుడు కిరణ్‌కుమార్‌రెడ్డి గారు... ఆయన పుణ్యమా అని రాష్ట్రంలో కరెంటు కనుమరుగైంది. దాని ఫలితంగా మనందరి ఇళ్లల్లో తిష్టవేసుకుని కూర్చున్న టీవీ భూతాలన్నీ పాత సామానుల అంగడికి చేరాయి. మన ఇళ్లల్లో భార్యల తిక్క కుదిర్చాడు మన కిరణ్‌కుమార్‌రెడ్డి అని అభినందించాడు. సంఘం కార్యదర్శి మొగలిరేకుల మన్మథరావు మాట్లాడుతూ... మా ఇంట్లో మేమెప్పుడూ టైంకు భోంచేసి ఎరుగం. మేం అన్నం తినాలంటే మధ్యాహ్నం 3గంటలకు వచ్చే 'ముదనష్టపు మొగుడు' సీరియల్ అయిపోవాల్సిందే! ఆరోజు కూడా సీరియల్‌లో ఏదన్నా సెంటిమెంట్ సీన్‌లు వస్తే మా ఆవిడ మూడ్ మారిపోయి ఏడుస్తూ బెడ్‌రూంలోకి వెళ్లిపోతుంది. పక్కరోజు సీరియల్ టైం అయ్యేదాకా అక్కడ నుండి కదిలేది కాదు. ఆమెతో పాటు మమ్మల్ని పస్తు పెట్టేది. సీరియల్ చూసి మనసు కకావికలమైనరోజు మొగుడిని అని కూడా చూడకుండా నన్ను చితక్కొట్టేది.. 'మొగుని కేకలు' సీరియల్ వచ్చే టైంలో మా ఇంటికి ప్రధాని మన్మోహన్‌సింగ్ వస్తున్నాడని చెప్పినా చలించేది కాదు... ఏదైనా సీరియల్ తర్వాతే అని చెప్పేది. కాని రోజుకు ఒక సీరియల్ అయితే సరే.. పొద్దున్నే చూస్తే... 'తాగే మొగుడు-తన్నే పెళ్లాం', 'మొరటుబిడ్డ', 'అత్త కాదు పోట్ల గిత్త', మధ్యాహ్నం చూస్తే 'అంతులేని రాగాలు', 'ఎండిపోయిన బావులు', 'నీ మొగుడే నా మొగుడు', లేడీవిలన్', 'మొగుడుకావాలా, పెళ్లాం కావాలా', 'నీ మొగుడు నాకే సొంతం' వంటి సీరియల్స్ కంటిన్యూగా వస్తుండేవి. మా ఆవిడైతే సీరియల్స్ చూసే బిజీలో ఎన్నిసార్లు టిఫిన్ తినడం... సారీ చేయడం మర్చిపోయిందో, ఎన్నిసార్లు గ్యాస్ పొయ్యిమీద బియ్యం పెట్టి మరచిపోయిందో లెక్కేలేదు. ఈ ఒరిజినల్ హృదయవిదారక సంఘటనలను తలచుకుని సీరియల్‌లో పాత్రల కంటే ఎక్కువగా మేమే ఏడ్చివుంటాం... మమ్మల్ని ఈ కష్టాల నుండి గట్టెక్కించేదెవరా అని ఎదురుచూసాం... దేవుడు మా మొర ఆలకించాడు. కిరణ్‌కుమార్‌రెడ్డి రూపంలో ఆ దేవుడే వచ్చాడు. కరెంట్ లేకుండా చేసి, ప్రతి ఇంటి నుండి టీవీ భూతాన్ని తరిమేసిన మాంత్రికుడయ్యాడు. ఇప్పుడు మేమంతా టైంకు తింటున్నాం. టైం కాకముందే పడుకుంటున్నాం. సీరియల్స్ చూసి మానసికంగా కృశించి పోయే పరిస్థితులు లేవు. ఇదంతా కిరణ్‌కుమార్‌రెడ్డి గొప్పతనమే... ఆయనకు రాష్ట్రంలోని ప్రతి మొగుడు ఋణపడి వుంటాడు అని చెప్పి ముగించాడు. తర్వాత అందరూ కలిసి కిరణ్‌ను 'సీరియల్స్ కిల్లర్' బిరుదుతో సత్కరించారు.

కిరణ్ బృందం అక్కడనుండి పురావస్తుశాఖ నూతన మ్యూజియం ప్రారంభోత్సవానికి వెళ్లింది. అది ఎలక్ట్రానిక్ వస్తువులతో ఏర్పాటు చేసిన మ్యూజియం. మొదట కిరణ్‌కుమార్‌రెడ్డి, మిగతా మంత్రులు అక్కడ డిస్‌ప్లేలో టీవీ వద్దకు వెళ్లారు. అక్కడ నిలబడివున్న విద్యార్థిని టీవీని గురించి వర్ణిస్తూ... కొన్నేళ్ల క్రితం మన సమాజంలో దీనిని బాగా వాడేవాళ్లు. టీవీలలో వచ్చే సీరియల్స్ చూసి చాలామంది పిచ్చోళ్లయ్యారు. టీవీలలో వచ్చే కార్టూన్ చిత్రాల కోసం పిల్లలు స్కూళ్లకు ఎగ్గొట్టేవాళ్లు. ఈ టీవీ మూలంగా సమాజంలో విషవాతావరణం నెలకొంటున్న తరుణంలో కిరణ్‌కుమార్‌రెడ్డి అనే మహానుభావుడు కరెంట్ లేకుండా చేసి దీని పీడ వదిలించాడు అని చెప్పింది. కిరణ్‌కుమార్ రెడ్డి అంతా విని మిగిలిన మంత్రుల వైపు గర్వంగా చూసాడు. తర్వాత వాళ్లు అక్కడే వున్న మిక్సీ దగ్గరకు వెళ్లారు. అక్కడవున్న విద్యార్థి దాని గురించి వర్ణిస్తూ... దీనిని మిక్సీ అంటారు. ఇది రాకముందు ప్రతి ఇంట్లోనూ రోలు, రోకలిబండ వుండేవి. ఆ రోళ్లలోనే అన్నిరకాల పచ్చళ్లు దంచేవాళ్లు. ఆ రోటి పచ్చడి నోటికి ఎంతో రుచిగా వుండేది. కాని మిక్సీలు వచ్చాక ఎటువంటి పచ్చడి అయినా చిటికెలో చేయడం మొదలుపెట్టారు. అయితే రుచిపచి వుండేది కాదు. రాష్ట్రంలో ప్రజలందరూ రుచికరమైన పచ్చళ్లకు అలమటిస్తున్న తరుణంలో ఈ రాష్ట్ర పరిపాలకుడిగా వున్న కిరణ్‌కుమార్‌రెడ్డి దయవల్ల రాష్ట్రంలో కరెంట్ పీడ పోయింది. దాంతో మిక్సీలన్నీ పాత ఇనుపసామాను అంగడికి చేరాయి. ప్రజలంతా రోళ్ల వద్ద పచ్చడి నాకుతూ ఎంతో సంతోషంగా వున్నారని చెప్పాడు. ఆ చిన్నారి మాటలకు కిరణ్ మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. మిగతావారితో... ఈ రాష్ట్రంలో కరెంట్ అనేది లేకుండా చేసి ఇన్ని కుటుంబాలలో సుఖశాంతులు నింపాను... ఈ జన్మకు ఇంతకంటే ఏం కావాలి అని ఉద్వేగంతో అన్నాడు. మిగతా మంత్రులు కూడా ఆయనను అభినందిస్తూ... యూవర్‌గ్రేట్ కిరణ్ అని భుజం బలంగా తట్టి బయలుదేరారు.

## సృష్టిధర్మానికి రెండు అవార్డులు

నెల్లూరు వారు ప్రదర్శించిన సృష్టిధర్మం నాటిక రెండు అవార్డులను గెలుచుకుంది. ఇటీవల విజయనగరంలో రాష్ట్రస్థాయి నంది నాటకోత్సవాలు-2012ను నిర్వహించారు. ఈ నాటకోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ పోటీలలో ప్రదర్శించిన సృష్టిధర్మం నాటికకు సంబంధించి ఉత్తమ హాస్యనటుడు అవార్డులను ఎఫ్.ఎల్.కుమార్, ఉత్తమ రంగాలంకరణకు కె.సాయికార్తీక్ బృందం అవార్డులను గెలుచుకుంది. రాష్ట్ర చలనచిత్ర, బుల్లితెర, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండి.దానకిశోర్, కలెక్టర్ ఎం.వీర బ్రహ్మయ్య, జేసీ శోభ, సినీ నాటకరంగ ప్రముఖులు గొల్లపూడి మారుతీరావులు బహుమతులు అందజేశారు. సృష్టిధర్మం నాటికకు రెండు అవార్డులురావడం సింహపురికే గర్వకారణం.

## 3న "స్వర్ణభారత్"లో పరిపూర్ణానంద ప్రవచనం

వెంకటాచలంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఫిబ్రవరి 3న సామాజిక, సాంస్కృతిక, విద్య, వైద్య, ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఉచిత వైద్యశిబిరంలో చెన్నైలోని విజయ హెల్త్‌కేర్ సెంటర్ డైరెక్టర్ డా॥సి.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో డా॥లక్ష్మీనారాయణ, డా॥హరికృష్ణ, డా॥ఉమాశంకర్, డా॥ప్రశాంత్, డా॥కమల్‌లు ఎముకలు, కీళ్ళ రుగ్మతలకు లోనయిన వారికి పరీక్షలు జరిపి సలహాలిచ్చి, ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనదలచినవారు ముందురోజు నిర్వహించే ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఎక్స్‌రే తీసి ల్యాబ్ పరీక్షలు కూడా చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.30గంటల నుండి కాకినాడ శ్రీపీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద సరస్వతి స్వామి, ట్రస్ట్ ప్రజామందిరంలో ప్రవచిస్తారని, పరిసరప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోంశాఖ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షులు, యం.పి.ముప్పవరపు వెంకయ్యనాయుడు పాల్గొంటారని తెలిపారు.

## మీడియా డైరీ ఆవిష్కరణ



ఏపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ నూతన డైరీని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడుతూ వార్తల సేకరణలో పాత్రికేయులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని, ప్రాణాలుసైతం ఫణంగా పెట్టి వార్తాసేకరణకు ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందుజనార్ధన్ ఎమ్మెల్యేలు బీదమస్తాన్‌రావు, బల్లి దుర్గాప్రసాద్, డిసిసి ఇన్‌చార్జి అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, సిపియం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఇమ్మాన్యుల్ బాబు, గౌస్ అహ్మద్, అశోక్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారపరంగా ఆర్థికస్థితి బాగుండి, అవకాశాలు బాగుండి ఆదాయం పెరిగిన అసంతృప్తి ఉంటుంది. వివాదాస్పద మాటలు వ్యాఖ్యానాల వల్ల సమస్యలు రావచ్చును. చేయదలచిన పనులకు ఏదో ఒక రూపంలో ఇబ్బందులుండి టెన్షన్ పడుతుంటారు. ఉద్యోగకృషిలో ఉన్న వారికి ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి. జీవిత భాగస్వామితో సమస్యలు లేకుండా చూచుకొనండి.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యాపారపరంగా క్రొత్త పథకాలతో, ఆలోచనలతో ముందుకు సాగుతారు. వృత్తి జీవనములో ప్రోత్సాహకం బాగుంటుంది. ఆదాయవృద్ధి బాగుంటుంది. క్రొత్త కాంట్రాక్టులు, టెండర్లు లభిస్తాయి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. బకాయిలు, ఇతరత్రా రావలసిన బాకీలు కొంత వరకు అందుతాయి.

## మిథునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులకు ఆటంకాలు కలిగిన ధైర్యంతో కొనసాగుతారు. వృత్తి వ్యాపారాలలో ఆశించినంత అభివృద్ధి కనుపించదు. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. అనుకోని ప్రయాణాలు, శారీరక శ్రమ ఎక్కువగా ఉంటుంది. అప్పులు ఇవ్వడం, హామీలివ్వడం చేయకండి. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. షేర్లు ఆశించినంత రీతిలో ఉండవు.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో ఉపాధి పథకాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయం ఖర్చులకు తగ్గట్టుగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు, ఆస్తుల లావాదేవీలు ఆందోళన కలిగిస్తాయి. పనులు, వ్యవహారాలు (కుటుంబవ్యవహారాలు) నిదానంగా ప్రశాంతంగా సాగుతాయి. షేర్లపై లాభాలు, పెట్టుబడులకై ఆహ్వానాలు అందుతాయి. రియల్ఎస్టేట్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వవత్తిడి ఎక్కువగా ఉంటాయి.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సోదరులతో బంధువర్గంతో ఆచితూచి వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి వుండి ఆదాయం పెరుగుతుంది. ఈ వారం వైద్యఖర్చులు పెరగవచ్చును. ప్రభుత్వ అనుమతులు, ఆర్థికమైన బిల్లులు మంజూరు కావడంలో ఆలస్యం ఉంటుంది. షేర్ల మార్కెట్ సంతృప్తికరం ఉండదు. శుభకార్యప్రయత్నాలు అనుకూలించకపోవచ్చును. సొంతపనులు, చెల్లింపులు సవ్యంగా సాగుతాయి.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తిపరంగా ప్రాబల్యం రాబడి ఉంటుంది. వ్యాపారవర్గాలకు అవకాశాలు మంచివి చేజారిపోయి, ఆదాయం తగ్గుతుంది. చెల్లింపులు బాకీలపై వత్తిడి ఉంటుంది. స్థిరాస్తులు, భూములు, స్థలాల కొనుగోలు విషయంలో తొందరవద్దు. కోర్టుకేసులు, రావలసిన బాకీలు వాయిదాపడతాయి. సొంత నిర్ణయాల కంటే కుటుంబసభ్యుల సలహాలు పొందడం మంచిది.



## రాశి - మీ వాసి

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 01.02.2013 నుండి
తేది. 07.02.2013 వరకు.

ఈవారం మేషంలో కేతువు, వృషభంలో గురువు, కన్యతులవృశ్చిక ధనురాశులలో చంద్రుడు, తులలో శనిరాహువులు, మకరంలో రవిశుక్రులు, కుంభంలో కుజబుధులు సంచరిస్తారు.

### పంచాంగము :

ముహూర్తములు లేవు.

### పుష్యమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 01 | శుక్ర | పంచమి | ఉ॥ గం.9.34వ॥ |
| తేది. 02 | శని | షష్ఠి | ఉ॥ గం.8.31వ॥ |
| | పిదప | సప్తమి | పూర్తిగా |
| తేది. 03 | ఆది | అష్టమి | రా॥ గం.4.27వ॥ |
| తేది. 04 | సోమ | నవమి | రా॥ గం.2.12వ॥ |
| తేది. 05 | మంగళ | దశమి | రా॥ గం. 11.47వ॥ |
| తేది. 06 | బుధ | ఏకాదశి | రా॥ గం.9.26వ॥ |
| తేది. 07 | గురు | ద్వాదశి | రా॥ గం.7.06వ॥ |

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. క్రొత్త ఆలోచనలు, ప్రణాళికలు ఇప్పుడు ప్రారంభం చేయవద్దు వృత్తిపరంగా మంచి పేరు ప్రతిష్ఠలుంటాయి. అయితే ఏ పనిలోనైన ముందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. శుభ కార్యాల ఆహ్వానాలు అందుకొనడం, ప్రయాణాలు నిర్ణయంచేయడం ఉంటుంది. పెట్టుబడులు పొదుపు పథకాలు లాభిస్తాయి.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

స్థిరాస్తుల లావాదేవీలులో లొసుగులుండవచ్చు కావున వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, వ్యాపకం పెరిగి, ఆదాయం పెరుగుతుంది. తల్లివర్గ బంధువుల అనారోగ్య వార్తలు వింటారు. చేపట్టిన పనులు ఎంతటి సమర్థతతో నిర్వహించినా చిన్నలోపాలు ఆటంకాలుంటాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. షేర్లు, స్థిరాస్తులపై ఆదాయం అందుకుంటారు.

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి జీవనంలో అవకాశాలు, వ్యాప్తి బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆదాయంలో స్వల్ప పెరుగుదల ఉండవచ్చును. స్థిరాస్తుల వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు, పౌరుషంగా మాట్లాడటం, ప్రవర్తించడం వల్ల సన్నిహితులతో తగాదాలు అభిప్రాయ భేదాలురాగలవు. అనుకోని ఖర్చులు ఈ వారంలో పైన బడగలవు. విద్యార్థులు మంచి కృషిచేయవలసి ఉంటుంది.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారవిస్తరణావకాశాలు బాగుంటాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కుటుంబంలో నిర్ణయాలు తీసుకొనే ప్రయత్నాలలో కొంత అసంబద్ధత ఉంటుంది. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. అధికారులకు పర్యటనలు, ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. సంఘ సమావేశాలు, కమిటీ సమావేశాలలో మీ సూచనలకు ఆమోదం ఉంటుంది.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో చిన్నచిన్న విభేదాలు చోటు చేసికొనగలవు కాబట్టి సర్దుబాటు అవసరం. స్థిరాస్తుల లావాదేవీలపై చర్చలు జరుపుతారు. రావలసిన బాకీల వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలందు అనుకూలత ఉంటుంది. గృహంలో ఒకరిద్దరికి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు ఇతర బాధ్యతలు పైనబడగలవు మరియు అధికారులు, పబ్లిక్‌తో జాగ్రత్త.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో ఆశించిన అవకాశాలు పెరగకపోయినా ఆదాయానికి లోపం ఉండదు. బంధుమిత్రుల రాకపోకలుంటాయి. ఇంటి ఖర్చులు, వైద్యఖర్చులు, ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరాలకు ఋణంచేస్తారు. కోర్టు వ్యహారాలున్న వారికి ఆందోళన ఉంటుంది. గృహమార్పులుండవచ్చును.

# పోలీసుల పనితీరు మెరుగుపడాలి

- నేరాల నియంత్రణపై దృష్టిపెట్టండి
- పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించండి
- నేరసమీక్షలో ఎస్పీ రమణకుమార్

నేరాల నియంత్రణపై దృష్టిపెట్టాలని, పనితీరును మెరుగుపరుచుకోవాలని జిల్లాలో పోలీసులు ఉన్నారా... లేరా... ఉంటే అసలు పనిచేస్తున్నారా అనే సందేహం కలుగుతుందని, పెండింగ్ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలంటూ జిల్లా పోలీసు అధికారుల తీరుపై జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన నేరసమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పగలు, రాత్రిళ్ళు గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, హైవే మొబైల్స్ జాతీయ రహదారిపై నేరాలు, ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 659 నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నగరాల్లో ఉన్న దాబాలు, కూల్‌డ్రింక్‌షాపుల్లో మద్యం విక్రయాలు చేసినా, సిట్టింగ్‌లు ఏర్పాటుచేసి మద్యం సేవించే ఏర్పాట్లు చేసినా పోలీసులు దాడులు చేయాలని, నిర్వాహకులపై కేసులుపెట్టి ఆ విషయాన్ని ఎక్సైజ్ అధికారులకు తెలపాలన్నారు. త్వరలో సహకార ఎన్నికలు జరుగనున్నదృష్ట్యా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగినచర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లను, అసాంఘిక శక్తులను బైండోవర్ చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఏ.సి.నాగేశ్వరరావు, నెల్లూరు నగర, రూరల్, గూడూరు, కావలి, ఆత్మకూరు డిఎస్పీలు పి.వెంకటనాథ్ రెడ్డి, హనుమంతరావు, ఇందిర, రాజమహేంద్రనాయక్, సిఐలు రాంబాబు, కిషోర్‌బాబు, సిసిఎస్ సిఐ వీరాంజనేయరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాల సీజ్



నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి సమీపంలో నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చే ప్రాంతంలో ఉన్న సిప్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల భవనాన్ని కార్పొరేషన్ అధికారులు సోమవారం సీజ్‌చేశారు.

ఇంటి నిర్మాణం పేరుతో అనుమతి తీసుకుని పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు స్పందించారు. వెంటనే పాఠశాల అనుమతి రద్దు చేశారు. దీంతో ఈ పాఠశాలలో ప్రైవేటుగా చదువుతున్న 15మంది పదవతరగతి విద్యార్థులు వీధినపడ్డారు. ఈ పాఠశాలకు మరొక పాఠశాలకు ఉన్న విభేదాలే కారణం అంటున్నారు స్థానికులు.


## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1980 ఫిబ్రవరి 14 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్.(కంప్యూటర్స్). ఉద్యోగం ఐ.టి.సి. ఇన్ఫోటెక్ లిమిటెడ్, కలకత్తా. జీతం నెలకు 50,000/-. ఆస్తి భాగం 5కోట్లు. తండ్రి డాక్టరు. తల్లి లెక్చరర్. స్వస్థలం ప్రొద్దుటూరుటౌన్. రెడ్డి కుటుంబం.
2. 1982 ఆగష్టు 17జననం. ఎత్తు 5'11". చదువు యం.టెక్., ఉద్యోగం సీనియర్ ఇంజనీర్, ప్రొడెక్టు డెవలప్‌మెంట్ - పూనా. జీతం నెలకు 60,000 రూపాయలు. ఆస్తి విలువ 2కోట్లు రైతు రెడ్డి కుటుంబం. స్వస్థలం గుంటూరు జిల్లా.
3. 1979 సెప్టెంబరు 23 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్). ఉద్యోగం అసిస్టెంట్ కన్సల్టెంట్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, చెన్నై. జీతం నెలకు 50వేలు. ఆస్తి విలువ 50లక్షలు. తండ్రి రైల్వే రిటైర్డు ఉద్యోగి. రెడ్డి కుటుంబం. ప్రస్తుత నివాసం పొన్నేరి. తిరువళ్ళూరు జిల్లా.
4. 1983 మే 21 జననం. ఎత్తు 5'10". చదువు బి.ఇ(ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్). ఉద్యోగం పట్నీ కంప్యూటర్స్ సిస్టమ్స్ చెన్నై. జీతం నెలకు రూ.55వేలు. ఆస్తి విలువ 2కోట్లు. వ్యాపార రెడ్డి కుటుంబం. కడపటౌన్.
5. 1980 డిసెంబరు 10 జననం. ఎత్తు 6'. చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కంపెని ఐ సాఫ్ట్ హైదరాబాద్. జీతం నెలకు 85వేలు. ఆస్తి విలువ 2కోట్లు. స్వస్థలం కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా. రెడ్డిరైతు కుటుంబం.

### వరుడు కావలెను

6. 1983 ఆగష్టు 12 జననం. ఎత్తు 5'2". చదువు బి.టెక్(ఐటి) ఉద్యోగం ఆక్సెంచర్ (హైద్రాబాద్). జీతం నెలకు 50వేలు. తండ్రి రిటైర్డు ఉద్యోగి, హైద్రాబాద్. స్వస్థలం కడపజిల్లా. రెడ్డి కుటుంబం. ఆస్తిభాగం 60లక్షలు.
7. 1983 ఫిబ్రవరి 9 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.ఇ.(కంప్యూటర్ సైన్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (ఒరెకల్) అమెరికా. ప్రస్తుత ఉద్యోగం ఇన్ఫోటెక్, చెన్నై. జీతం 50వేలు నెలకు. గ్రీన్‌కార్డ్ హోల్డర్. తండ్రి రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎ.హెచ్). చిత్తూరుజిల్లా స్వస్థలం. రెడ్డి కుటుంబం.
8. 1987 ఆగష్టు 18 జననం. ఎత్తు 5'2". చదువు బి.టెక్(ఐటి). తండ్రి ఎ.పి.యస్.ఆర్.టి.సి. ఉద్యోగి. తండ్రి స్వస్థలం సీతారాంపురం మండలం. ప్రస్తుత నివాసం కావలి. మధ్యతరగతి రెడ్డి కుటుంబం. ఆస్తి భాగం పది లక్షలు.
9. 1985 సెప్టెంబర్ 25జననం. ఎత్తు 5'. బి.ఇ.(హానర్స్) బిట్స్‌పిలాని. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ (ప్రైవేట్ సెక్టర్). జీతం నెలకు 45వేలు. హైదరాబాద్. తండ్రి హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లి., (ఉద్యోగం). స్వస్థలం కాకినాడ. రెడ్డి కుటుంబం. ప్రస్తుత నివాసం బొంబాయి.
10. 1985 ఫిబ్రవరి 16జననం. ఎత్తు 5'3". చదువు యం.యస్.(కంప్యూటర్స్) ప్రస్తుత ఉద్యోగం మార్కెటింగ్ ఆన్ రిపోర్ట్ డెవలపర్స్, ప్రస్తుతం నివాసం హైద్రాబాద్. స్వస్థలం కడపజిల్లా. తల్లి బ్యాంకు ఉద్యోగం. మధ్యతరగతి రెడ్డి కుటుంబం.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2. మెయిన్‌రోడ్డు [illegible]గుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version





## రాశి సెకండ్ ఇన్నింగ్స్

గతంలో ఎన్నో హిట్‌చిత్రాలను తన ఖాతాలో వేసుకున్న అందాల'రాశి' ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి మొదట బుల్లి తెరపై కనిపించింది. తాజాసమాచారం ప్రకారం కొన్ని పెద్ద నిర్మాణసంస్థలు నిర్మిస్తున్న సినిమాల్లో కూడా ఆమె నటించబోతుంది.

## మూ 'వీ' క్షణం





## సమంత నిరుత్సాహం

ప్రస్తుతం టాలీవుడ్‌లో పూర్తి డిమాండ్ వున్న హీరోయిన్లలో సమంత మొదటిస్థానంలో వుంది. ఈ భామ సినిమాలు వరుస హిట్‌లు సాధిస్తున్నాయి. అయితే వాటిపట్ల ఆమె సంతృప్తి చెందడంలేదు. ఒక ఛాలెంజింగ్ పాత్రలో చేయాలని, ఆ పాత్ర సింపుల్‌గా వుండకూడదని ఇప్పుడు చేస్తున్న పాత్రలకు భిన్నంగా వుండాలని ఆమె కోరుకుంటుంది. దీన్ని ట్విట్టర్‌లో వ్యక్తపరచింది.

బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో వస్తున్న 'ఒంగోలుగిత్త' చిత్రానికి సెన్సార్‌బోర్డు 'ఎ' సర్టిఫికెట్‌ను ఇచ్చింది. భాస్కర్ చిత్రానికి 'ఎ' సర్టిఫికేట్ రావడం చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు. దీనికి ప్రధానకారణం ఆ సినిమాలో రెండు సన్నివేశాల్లో ప్రకాష్‌రాజ్ నగ్నంగా కనిపించనుండడమే. ఈ సీన్‌లను బ్లర్‌చేసినా కూడా సెన్సార్ బోర్డు 'ఎ' సర్టిఫికేట్‌నే ఇచ్చింది.

## ఒంగోలుగిత్తకు 'A'





## అదిరిపోయే ఫైటింగ్స్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌ఖాన్ హీరోగా నటించిన 'ఏక్ థా టైగర్' ఏడాదిక్రితం విడుదలై సూపర్‌హిట్ సాధించింది. ఆ సినిమాలో తీసిన స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్‌లకు మంచి పేరొచ్చింది. ఆ సినిమాకు చేసిన టీమే ఇప్పుడు మహేష్ బాబు, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాకి ఫైట్స్ కంపోజ్ చేయనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## బంపర్ ఆఫర్ వద్దన్న 'తార'

బాలీవుడ్ కింగ్‌ఖాన్ షారూఖ్ పక్కన అవకాశం వస్తే ఏ హీరోయిన్ కూడా వదులుకోదు. కాని షారూఖ్ నటిస్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఐటమ్‌సాంగ్ కోసం దర్శకుడు నయన తారను సంప్రదించగా ఆమె సున్నితంగా ఆ ఆఫర్‌ను తిరస్కరించింది.



# గూడూరు డివిజన్ వార్తలు

## యువతచేతుల్లోనే దేశభవిత



గణతంత్ర దినోత్సవంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ జె.నివాస్

యువతచేతుల్లోనే దేశభవిత ఉందని గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్ అన్నారు. 64వ గణతంత్ర దినోత్సవ వేడుకలను గతనెల 26న గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, డిఎస్పీ టి.వి.హనుమంతరావుతో కలసి సబ్ కలెక్టర్ నివాస్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఎన్‌సిసి విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తోందని, ఎన్నో ప్రయోగాలను మన శాస్త్రవేత్తలు డివిజన్‌లోని శ్రీహరికోట నుండి ప్రయోగించి విజయం సాధించారన్నారు. ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేరినప్పుడే నిజమైన స్వేచ్ఛ వచ్చినట్లన్నారు.

డిఎస్పీ టి.వి.హనుమంతరావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, నేరాల నివారణకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు సబ్ కలెక్టర్, డిఎస్పీ, ఎమ్మెల్యేలు బహుమతులందజేశారు. గూడూరు తహశీల్దార్ మైత్రేయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి వుండాలని, ఓటరుకు ఓటే వజ్రాయుధంలాంటిదని గూడూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి టి.వి.హనుమంతరావు అన్నారు. గత నెల 25న గూడూరు దువ్వూరు నారాయణరెడ్డి పురమందిరంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 18ఏళ్ళ వయస్సు నిండిన వారు ఓటు హక్కును పొందాలని అన్నారు. మండల తహశీల్దార్ వై.మైత్రేయ మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని తమకు సంబంధించి ఓటును జాబితాలో చేర్చుకొనేందుకు ఇది ఒక మంచి అవకాశమని, అలాగే ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు కూడా చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు తమ అనుభవాలను గురించి తెలియజేసి తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఉప్పాల సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ జి.సి.సుశీలమ్మ, ఎంపిడిఓ నిర్మలాదేవితో పాటు ఎల్లసిరి గోపాలరెడ్డి, అరవ పార్వతయ్య, ఎం.రాజేష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

## వెంకటేశ్వరునికి పల్లకీసేవ

గూడూరు రాజావీధిలో వెలసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామికి గత నెల 26న పల్లకీసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు మూలవిరాట్‌ను దర్శించి కర్పూరహారతులతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులు పల్లకిసేవలో ఊరేగించారు.

## బషీర్‌కు విశిష్ట సేవాపురస్కారం



బషీర్‌ను సన్మానిస్తున్న ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరుజిల్లాలో ఎఆర్‌డి స్వచ్ఛందసేవా సంస్థ స్థాపించి బాలతేజస్సు పేరిట వివిధ కార్యక్రమాలు చేపట్టిన సంస్థ డైరెక్టర్ షేక్ బషీర్‌కు గణతంత్ర దినోత్సవం నాడు నెల్లూరు పోలీస్‌పేరెడ్‌గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో కలెక్టర్ బి.శ్రీధర్, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విశిష్టసేవా పురస్కారం అందజేశారు. ఎస్పీ బి.వి.రమణకుమార్ ఐటిడిఎ జిల్లా ప్రాజెక్టు అధికారి యాకసిరి వెంకటేశ్వర్లు, నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బషీర్ సేవలను కొనియాడారు.

## ఎఐటియుసి ర్యాలీ



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాచైతన్య నాయకులు

ఎఐటియుసి, ప్రజా చైతన్య వేదిక ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఎందరో త్యాగమూర్తులు ప్రాణాలు త్యాగంచేసి తెచ్చిన స్వాతంత్ర్యాన్ని నేటి పాలకులు మళ్లీ వారికే తలొగ్గిన పరిస్థితులు నేడు దేశంలో జరుగుతున్నాయని ప్రజా చైతన్య వేదిక నాయకులు రాజేష్‌కుమార్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ నుండి ప్రదర్శనగా టవర్‌క్లాక్‌సెంటర్‌కు చేరుకొని మానవహారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు కె.వి.కృష్ణయ్య, సిపిఐ నాయకులు సివిఆర్ కుమార్, లక్కు కృష్ణారెడ్డి, గిరిజన నాయకులు శాంతయ్య, రమణయ్య, ఎస్.నాగమ్మ, హసీనా, గుంజి విజయభాస్కర్, షబ్బీర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## మద్రాస్ యూనివర్శిటీ సిండికేట్ సభ్యుడిగా
# ఆచార్య సియంకె రెడ్డి

తెలుగుగడ్డపై జన్మించి తమిళనాట ప్రకాశిస్తున్న వైద్యకిరణం డాక్టర్ చిల్లకూరు ముద్దుకృష్ణారెడ్డి. అందరూ ముద్దుగా సి.యం.కె. అని పిలుచుకునే ఈ 7పదుల మేధావి గత 4దశాబ్దాలకు పైగా తమిళ నాడులో తెలుగువారికి అందించిన సేవలు అపారం. ముద్దుకృష్ణారెడ్డికి తెలియని తెలుగువారు, ముద్దుకృష్ణారెడ్డిని తెలియని ఆంధ్రులు మద్రాసులో లేరంటే అతిశయోక్తి కాదు. సి.యం.కె.ని గతంలో ఎన్నో అవార్డులు, పదవులు, బిరుదులు వరించాయి. ఇప్పుడు వాటికి తోడుగా "మద్రాసు యూనివర్శిటీ సిండికేట్ మెంబర్" పదవి ఆయన పేరుకు ప్రక్కన చేరింది. తమిళనాడు గవర్నర్ డా॥ కొణిజేటి రోశయ్య డా॥ సి.యం.కె. అందించిన, అందిస్తున్న సేవలకు గుర్తుగా ఈ గౌరవాన్ని ఆయనకు కల్పించాడు.

దాదాపు 170 సంవత్సరాల క్రితం ఏర్పడ్డ అతి పురాతన యూనివర్శిటీయే కాకుండా తమిళనాట నెలకొల్పబడిన మొట్ట మొదటి విశ్వవిద్యాలయం మద్రాసు యూనివర్శిటీ. ప్రస్తుతం తమిళనాడులో వున్న అనేక యూనివర్శిటీలకు మాతృసంస్థ మద్రాసు విశ్వవిద్యాలయమే. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలో సిండికేట్ సభ్యత్వం అతి కీలకమైనది.

నిర్వహణా విభాగం తీసుకునే అన్ని ముఖ్య నిర్ణయాలకూ సిండికేట్ ఆమోదం తప్పనిసరి. కార్యనిర్వాహక మండలిగా ఇప్పటికే మన రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల్లో ఈ విభాగం పనిచేస్తున్నప్పటికీ ఈ యూనివర్శిటీలో ఈ బృందాన్ని సిండికేట్‌గానే పిలుస్తున్నారు. మద్రాసు నగరం చెన్నైగా మారినప్పటికీ ఈ విశ్వవిద్యాలయాన్ని మాత్రం పాతపేరుతోనే పిలవాలని పలు సంస్థలు ఉద్యమించడమే కాకుండా పలువురు మేధావులు కూడా సూచించడంతో ఆ పేరును అలాగే వుంచేశారు.

శస్త్ర చికిత్సలో దిట్టగా ఇప్పటికే దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ప్రొఫెసర్ సి.యం.కె.రెడ్డి నెల్లూరీయుడు. 1942లో జన్మించిన ఆయన 1964లో యం.బి.బి.యస్ పట్టా అందుకున్నారు. తదుపరి 5సంవత్సరాలు జనరల్ అండ్ వాస్క్యులర్ సర్జరీలో యుఎస్ఏలోని హాప్‌కిన్స్ యూనివర్శిటీలో శిక్షణపొంది 1970లో ఎఫ్.ఆర్.సి.యస్. పూర్తిచేసి భారతదేశానికి తిరిగివచ్చారు. అప్పటినుంచి ముప్పై సంవత్సరాలు చెన్నైలోని ప్రభుత్వ వైద్యశాల అయిన స్టాన్లీ మెడికల్ కాలేజ్ & హాస్పిటల్‌లో సర్జరీ విభాగానికి గౌరవ ఆచార్యులుగా విశిష్ట సేవలందించారు. విశేషమేమిటంటే ఈ ముప్పై సంవత్సరాలు ఎటువంటి జీతభత్యాలు తీసుకోకుండా ఆయన ఈ సేవలందించారు.

ప్రస్తుతం తమిళనాడు డా॥ యంజిఆర్ మెడికల్ యూనివర్శిటీకి ఎమిరిటస్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీగా వున్న ఈయన ప్రతిష్టాత్మకమైన తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా తెలుగు ఫెడరేషన్, లింగ్విస్టిక్ మైనారిటీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు తదితర సమాఖ్యలకు అధ్యక్షులుగా గౌరవింపబడుతున్నారు. తమిళనాడు మెడికల్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులుగా, శ్రీ జయేంద్ర సరస్వతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మెడికల్ డైరెక్టర్‌గా, రామచంద్ర యూనివర్శిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సభ్యులుగా డా॥ యంజిఆర్ మెడికల్ యూనివర్శిటీ సెనేట్ & గవర్నింగ్ కౌన్సిల్ సిండికేట్ మెంబర్‌గా గతంలో అత్యున్నత సేవలందించిన ధీశాలి ప్రొ॥ సి.యం.కె.రెడ్డి. ఆయన ప్రతిభకు, సేవా దృక్పథానికి తార్కాణాలుగా నిలిచే ఎన్నో పురస్కారాలు ఆయనను వరించాయి. వాటిలో చెప్పుకో తగ్గవి ఎన్నో వున్నా 2000సంవత్సరంలో రాష్ట్రపతి నుంచి అందుకున్న డా॥ బి.సి. రాయ్ జాతీయ అవార్డు, 2008లో ఉదవయ్, ఉళ్ళంగళ్ & సిఐఓఎస్‌పి అందించిన డా॥ కెఎస్ సంజీవి జీవిత సాఫల్య పురస్కారం, 2011లో డా॥ యం.జి.ఆర్ యూనివర్శిటీ నుంచి జీవితసాఫల్య పురస్కారం, రాష్ట్రపతి నుంచి అందుకున్న రాష్ట్రీయ మహావీర్ పరిషత్ అవార్డులు తలమానికాలుగా నిలుస్తాయి. ఇలా ఎన్నో గౌరవాలు పొందిన ప్రొ॥ సి.యం.కె.రెడ్డి ఎదిగిన కొద్దీ ఒదిగి వుండే మనస్తత్వంతో నిరాడంబరంగా సేవాదృక్పథంతో ప్రతి గురువారం పేద రోగులకు ఉచితంగా వైద్యసేవలందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

ప్రస్తుత తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య తనకుగల ప్రత్యేక అధికారాలతో ముద్దుకృష్ణారెడ్డిని ఈ పదవిలో నియమించారు. మూడేళ్ల పాటు కొనసాగే సిండికేట్ సభ్యత్వపదవిలో ఫిబ్రవరి 26 నుండి తన సేవలను సియంకె రెడ్డి అందించనున్నారు. ఎన్నో ఉన్నతపదవులను, అత్యున్నత అవార్డులను తన సొంతం చేసుకున్న ఈ వైద్యాచార్యుడికి 'లాయర్' శుభాభినందనలు.

# సిఎంఆర్ కారు విజేత షేక్ రెహమత్



లక్కీడ్రా తీసి విజేతను ప్రకటిస్తున్న నెల్లూరునగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి

నెల్లూరు నగరంలోని సిఎంఆర్, చందన సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన బంపర్‌డ్రాలో షేక్ రెహమత్ హుందాయ్ ఇయాన్ డిలైట్ కారును గెలుచుకున్నారు. సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో గత నెల 26వ తేదీ రాత్రి నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి బంపర్‌డ్రా తీయగా వెంకటేశ్వరపురం జనార్ధనరెడ్డి కాలనికి చెందిన రెహమత్ ఎంపికయ్యారు. వీక్లీ డ్రా విజేతగా పెళ్ళకూరు మండలం తాళ్వాయిపాడుకు చెందిన మునీశ్వర్ కుమార్ హీరోహోండా మోటార్‌సైకిల్‌ను గెలుచుకున్నారు. డైలీడ్రా విజేతలు 23 మందికి ఎల్‌సిడి, వాషింగ్‌మిషెన్, మైక్రోఓవెన్, డివిడిలను అందించారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ సంస్థల అధినేత మావూరి శ్రీనివాసరావు, సిఎంఆర్ పర్యవేక్షకులు పెంచలయ్య, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# మార్మోగిన మాగుంట లే అవుట్

(7వ పేజీ తరువాయి)



మాగుంట లే అవుట్‌లోని మాగుంట సుబ్బరామరెడ్డి స్మారక ఉద్యానవనంలో తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు

తదితరులు ఈ వేడుకలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులను అందుకున్నారు.

నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా చెరుకుపల్లి పిచ్చిరెడ్డి, గౌరవ సలహాదారుడిగా ముప్పా బలరామనాయుడు, అధ్యక్షుడిగా తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు), ఉపాధ్యక్షుడిగా గోళ్ళమూడి శ్రీధర్ రెడ్డి, కోశాధికారిగా ముడి శోభన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కనుమూరి శ్రీనివాసులరెడ్డి, సహకార్యదర్శులుగా వట్టిగుంట చంద్రయ్యచౌదరి, దండమూడి హేమంతకుమార్, ముచ్చాల శ్రీనివాసులరెడ్డి తమ బాధ్యతలను చేపట్టారు.

అద్యంతం ఆధ్యాత్మిక చింతనతో జరిగిన ఈ కళ్యాణ పండుగలో మురళీకృష్ణ హజరత్‌బాబు, బి.వి.నరసింహం, నలుబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి సుధాకర్, కళాంజలి అనంత్, క్లాసిక్ గ్రాఫిక్స్ విష్ణు, బెనర్జి, మల్లి, సాంసంగ్ సురేష్, మాగుంట లే అవుట్ నివాసితులైన అనేకమంది యువకులు పాల్గొని కార్యక్రమ నిర్వహణలో తమ పూర్తి సహాయసహకారాలను అందించారు.

కార్యక్రమానికి వచ్చిన ప్రతి భక్తుడికీ తిరునామాలు దిద్దిన నారా నాగేశ్వరరావు బృందం, భక్తుల పాదరక్షలకు పూర్తి భద్రత కల్పించిన 'ఇస్కాన్' సేవకులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుమలేశుని ప్రతినిధిగా నెల్లూరీయులు భావించే వాకాటి విజయకుమార్ రెడ్డి పూర్తి వేడుకను దగ్గరుండి పర్యవేక్షించి విజయవంతంగా ఈ శుభకార్యాన్ని జరపడానికి కారణభూతులయ్యారు.

ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ పక్షాన శివప్రభాత్‌రెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు.



PDF Compressor Free Version



# జీవన విధానాన్ని నేర్పేదే భగవద్గీత

పరిపూర్ణానంద సరస్వతి



మనిషి ఎలా జీవించాలి... ఎందుకు జీవించాలి అన్న అంశాలను నేర్పేదే భగవద్గీతని కాకినాడ శ్రీ పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామిజీ పేర్కొన్నారు. నెల్లూరులోని వి.ఆర్.కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం 85వ గీతాజ్ఞాన యజ్ఞం వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డితో కలసి శ్రీ స్వామిజీ జ్యోతి ప్రకాశనంగావించారు. శ్రీ కృష్ణుని విగ్రహానికి తులసిమాలను వేసి నమస్కరించి భగవద్గీత 12వ అధ్యాయం భక్తియోగం అంశంపై ప్రవచించారు. శ్రీ స్వామిజీ ఉపన్యసిస్తూ పరిపూర్ణ మానవత్వమే దైవత్వానికి పునాది అన్నారు. పుట్టుక ఒకబిందువని, మరణం మరొక బిందువని ఈ రెండు బిందువులను కలుపుతూ గీచే గీతనే జీవితం అంటారన్నారు. తిక్కన మహాకవితో పాటు ఎందరో మహానుభావులను అందించిన నేల నెల్లూరని నేను నెల్లూరు వాడినేనన్నారు. తన 14వ ఏట విఆర్ హైస్కూలులో 8,9తరగతులు చదివి 10వతరగతి మధ్యలో తన తల్లి కోరికమేరకు వేదపాఠశాలలో చేరానని, ఆ తర్వాత 24ఏళ్ళకు నెల్లూరుకు వచ్చానన్నారు. తాను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న హిందూ రథయాత్రను ఇక్కడ నుండే ప్రారంభిస్తానన్నారు. అంతకు ముందు సభాస్థలికి చేరుకున్న స్వామికి మాచవోలు రమేష్‌శర్మ నేతృత్వంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమ సరళిని సహస్ర సభాసింహం బివి నరసింహం నిర్వహించారు. మహిళలు పెద్దలు, పిల్లలు నగర ప్రముఖులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**సమైక్యవాదమే భక్తియోగం:** శ్రీ కృష్ణ పరమాత్మ సమాజాన్ని సమైక్యంగా ఉంచేందుకు భగవద్గీత ద్వారా భక్తియోగంలో పలుమార్గాల్ని భక్తులకు అందించారన్నారు. మతం భగవంతుని పేరిట మానవుల మధ్య చిచ్చురేపే ఛాందస్య వాదాన్ని వీడాలని కోరారు. సర్వమానవాళికి అందుబాటులో సరళమైనతత్వాన్ని పరిపూర్ణానందసరస్వతి ప్రవచించారు.

**దేవుడు ఒక్కడే... ఇన్ని మతాలు ఎందుకు:** భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామిగా ప్రతి మతం భావిస్తోందన్నారు. అలాంటి భగవంతుడు ఒక్కొక్క మతానికి ఒక్కొక్కలా వ్యక్తంకావడాన్ని అందరూ ఆలోచించాలన్నారు. గాలి కూడా విశ్వవ్యాప్తంగా వుందని, గాలిపట్ల ఏలాంటి అనుమానాలు ఏ మతం వారికి ఉండడం లేదన్నారు. అన్ని మతాలవారు గాలిని పీల్చుకుంటూ జీవిస్తున్నారన్నారు. మానవుని ప్రాణం ఊపిరి, గాలేనని కంటికి కనపడని భగవంతుని గురించి లేడని కొందరు, ఉన్నారని మరికొందరు వాదిస్తున్నారని, భగవత్‌తత్వాన్ని శంకించడం మూర్ఖత్వం అవుతుందని, ఆతత్వాన్ని ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానించడం మాత్రం చాలా ప్రమాదకరమని పూజ్యశ్రీ స్వామి పరిపూర్ణానంద సరస్వతి ప్రవచించారు. ఈ కార్యక్రమాల్లో కార్యవర్గసభ్యులు పాబోలు రామసుబ్బయ్య, వీరిశెట్టి హాజరత్‌బాబు, యాదాల నందకిషోర్, ఆకు పుండరీకాక్షం, రైతుడిపో సుధాకర్, పేర్నాటి రంగారెడ్డి, పచ్చిపులుసు శ్రీరాములు, కోట గురుబ్రహ్మం, కోమల ప్రసాద్, నగర ప్రముఖులు నలుబోలు బలరామయ్యనాయుడు, గుండాల గురవయ్య, డా॥మండవ శ్రీధరరావు పాల్గొన్నారు. స్వామి ప్రవచనాలను వినడానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడం విశేషం.



# మెట్టుదిగని అక్క... పట్టువీడిన తమ్ముడు



- కలువాయి సొసైటీలో తెగిన పంచాయితీ

సహకార సంఘాల ఎన్నికలలో జిల్లాలోని అన్ని సొసైటీలలో కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్, కొన్ని చోట్ల మాత్రం కాంగ్రెస్ సపోర్ట్‌తో తెలుగుదేశం వర్సెస్ వైయస్సార్ కాంగ్రెస్ అన్నట్లుగా పోటీ జరిగింది. కాని కలువాయి సొసైటీలో మాత్రం ఇందుకు భిన్నమైన వాతావరణం నెలకొనివుండింది. కలువాయి సొసైటీలో 13సెగ్మెంట్లలో అధికార కాంగ్రెస్ నుండే అటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి వర్గీయులు ఇటు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వర్గీయులు ముఖాముఖీ తలపడ్డారు. ఈ మండలంపై పట్టు కోసం అటు నేదురుమల్లి రాజ్యలక్ష్మి, ఇటు ఆనం రామనారాయణరెడ్డిలు తీవ్రంగానే పోరాడుతున్నారు. కలువాయి ఒకప్పుడు రాపూరు నియోజకవర్గ పరిధిలో వుండేది. 2009 ఎన్నికలకు ముందు ఈ మండలంలోని కాంగ్రెస్ కేడర్ ఆనం నాయకత్వంలోనే వుండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో రాపూరు అసెంబ్లీ గల్లంతయ్యింది. దీంతో కలువాయి మండలం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోకి వచ్చింది. 1999 నుండి వెంకటగిరికి రాజ్యలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2009 ఎన్నికలలో ఓడిపోయినా కూడా ఈ నియోజకవర్గానికి ఆమే ఇన్‌ఛార్జ్. కాబట్టి కలువాయి మండలంలో పార్టీ కార్యకలాపాలు ఆమె పరిధిలోకే వస్తాయి. కాకపోతే ఆమె నాయకత్వంలో పనిచేయడం ఆనం వర్గీయులకు ఇష్టం లేదు. అందుకే ఈ సహకార ఎన్నికలలో కలువాయి సొసైటీలోని 13సెగ్మెంట్లలో ఆనం వర్గీయులు నిలబడ్డారు. దీంతో నేదురుమల్లి వర్గీయులు డీలాపడ్డారు. వాళ్లు అన్ని సెగ్మెంట్లలో పోటీగా నామినేషన్లు వేశారు. ఇరువర్గాల వాళ్లు తన్నుకునేదాకా పరిస్థితులు వెళ్లాయి. రాజ్యలక్ష్మి వెంటనే పీసీసీ చీఫ్ బొత్స దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. ఆయన జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి పితాని సత్యనారాయణకు ఈ పంచాయితీ అప్పగించాడు. పితాని ఆగమేఘాలమీద మంగళవారం రాత్రికి నెల్లూరు చేరుకున్నారు. మంత్రి ఆనం కూడా ఆరోజే నెల్లూరు రావడం జరిగింది. బుధవారం కలువాయికి చెందిన ఆనం వర్గీయులను పిలిపించి పితాని చర్చించాడు. వారిని శాంతపరిచాడు. పితానితో పాటు ఆనం కూడా సర్దిచెప్పడంతో ఆనం వర్గీయులు 11మంది పోటీ నుండి తప్పుకున్నారు. రెండు సెగ్మెంట్ల అభ్యర్థులు మాత్రం పోటీలోనే వుండిపోయారు. మొత్తానికి పితాని రాకతో కథ సుఖాంతమైంది. ఆనం వర్గం చేతిలో రాజ్యలక్ష్మికి మరోసారి పరాభవం తప్పింది. ఇప్పటికే మహిళా కమీషన్ ఛైర్మెన్ పదవి విషయంలో తన తమ్ముళ్లనుకున్న ఆనం బ్రదర్స్ కొట్టిన దెబ్బకు ఆమె తేరుకోలేకపోతుంది. కలువాయి సొసైటీలో పైచేయి సాధించడం ఆమెకు కొంత రిలీఫ్ అనుకోవచ్చు.

# చెన్నై - బెంగుళూరు కారిడార్‌లోకి కృష్ణపట్నం



చెన్నై-బెంగుళూరుల మధ్య పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. మొదటి ప్రతిపాదన ప్రకారం ఈ కారిడార్ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో కొంత భాగాన్ని కలుపుకుని తమిళనాడులో రూపొందుతుంది. ఈ కారిడార్‌ను 6వేల కోట్లతో ఏర్పాటు చేయనుండగా, ఇందులో జపాన్ ప్రభుత్వమే 5వేల కోట్లు భరిస్తుంది. వెయ్యి కోట్లు మాత్రం మన కేంద్రప్రభుత్వం అందజేయనుంది. చెన్నై-బెంగుళూరుల మధ్య దాదాపు 290కిలోమీటర్ల మేర ఆరులైన్ల రహదారిని పూర్తిగా కొత్తదిగా నిర్మించనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణ కూడా జరుగుతుంది. రోడ్డు నిర్మాణానికే కిలోమీటరుకు 8కోట్ల రూపాయల వంతున ఖర్చు పెట్టనున్నారు.

జపాన్‌కు చెందిన ఎన్నో పరిశ్రమలు బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటవుతున్నాయి. అయితే ఈ పరిశ్రమల ఉత్పత్తుల రవాణాకు పోర్టులు ఎంతో కీలకం. బెంగుళూరు నుండి చూస్తే కర్నాటక రాష్ట్రంలో వున్న పోర్టుల కంటే చెన్నై పోర్టు దగ్గర. కాబట్టి మొదట చెన్నై-బెంగుళూరుల మధ్య పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి సంకల్పించారు.

అయితే భవిష్యత్ అవసరాల దృష్ట్యా మన రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కూడా పరిశీలించిన కేంద్రప్రభుత్వం ఈ కారిడార్ పరిధిలోకి నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టును కూడా చేర్చింది. ఇంతకుముందు ప్రతి పాదనల్లో చిత్తూరుజిల్లా మాత్రమే వుండగా, ఇప్పుడు నెల్లూరుజిల్లా, అనంతపురం జిల్లాలను అదనంగా చేర్చారు. చిత్తూరుజిల్లా నుండి కృష్ణపట్నం పోర్టు వరకు ప్రత్యేకరహదారి ఏర్పాటు కానుంది. ఈ కారిడార్ వస్తే కృష్ణపట్నం పోర్టు నుండి భారీస్థాయిలో ఎగుమతులు, దిగుమతులు వుంటాయి. కృష్ణపట్నం పోర్టును కూడా కంటైనర్ పోర్టుగా అభివృద్ధి చేస్తుండడంతో పారిశ్రామికంగా నెల్లూరుజిల్లా అభివృద్ధి చెందనుంది. రియల్‌ఎస్టేట్, ఇతర వ్యాపారాలు పూర్తిగా ఆగిపోయి దిక్కుతోచని స్థితిలో వున్నవారికి ఇది శుభవార్త. 2016 కల్లా ఈ కారిడార్‌ను పూర్తి చేయనున్నారు.






# కరెంటుపోరు ఉధృతం



కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న కరెంటు ఛార్జీల దోపిడీకి నిరసనగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో "కరెంటు పోరు" పేరుతో కోటంరెడ్డి పిలుపు మేరకు సాగుతున్న నిరసన రోజు రోజుకి ఉధృతం అవుతుంది. 30వతేదీ ఉదయం నెల్లూరు వేదాయపాళెంలో జరిగిన పోస్ట్ కార్డుల నిరసన కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ కరెంటు ఛార్జీల దోపిడీని వ్యతిరేకిస్తూ నిరంతర ప్రజా ఉద్యమాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తామని, వాడవాడలా కరెంటు పోరును ఉధృతం చేస్తామని అన్నారు. ధర్నాలు, దీక్షలు, గాంధీగిరి నిరసనలతో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని కరెంటు ఛార్జీల దోపిడిని అడ్డుకుంటామని చెప్పారు. రూరల్ నియోజకవర్గం నుంచి పోస్టుకార్డులు, ఎస్.ఎమ్.ఎస్‌లు, ఇ-మెయిల్స్, టెలిగ్రాములు, సంతకాలతో లక్ష నిరసనలు తెలియజేస్తామని, లక్ష నిరసనల కార్యక్రమాన్ని ప్రజలందరూ జయప్రదం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కె.వి. రాఘవరెడ్డి, నరసింహయ్య ముదిరాజ్, పురుషోత్తం యాదవ్, సుజిత, పద్మ, కొండారెడ్డి, మురహరి, రాజగోపాల్‌రెడ్డి, కుమార్, మీనమ్మ, సురేష్, మణి, సత్యం, జావిద్, రఫి తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.